

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 12-07-2025 | సంపుటి - 24 | సంచిక - 69 | రూ : 4 | పేజీలు: 8




## ఢిల్లీలో భూప్రకంపనలు.. ఈ వారంలో రెండోసారి

- హర్యానాలో 3.7 తీవ్రతతో భూకంపం
- రాత్రి ఏడు గంటల ప్రాంతంలో ఢిల్లీ సహా పలు ప్రాంతాల్లో ప్రకంపనలు
- ఝజ్జర్‌లో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం గుర్తింపు

దేశ రాజధాని న్యూఢిల్లీలో శుక్రవారం సాయంత్రం భూకంప ప్రకంపనలు సంభవించాయి. సాయంత్రం ఏడు గంటల సమయంలో హర్యానాలో 3.7 తీవ్రతతో భూకంపం సంభవించడంతో ఢిల్లీలో ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఝజ్జర్‌లో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. రెండు రోజుల వ్యవధిలో

తరువాయి 2లో

## వందలాది మంది దౌత్యవేత్తలు, సివిల్ సర్వెంట్లకు ట్రంప్ ప్రభుత్వం షాక్!

- తొలగించేందుకు అమెరికా సిద్ధం
- తొలగింపు జాబితాలో 1107 మంది సివిల్ సర్వెంట్లు, 246 మంది దౌత్యవేత్తలు
- లేఆఫ్ నోటీసులు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడి

డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం వందల సంఖ్యలో ఉన్నతాధికారులను తొలగించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ తొలగింపు జాబితాలో 1,107 మంది సివిల్ సర్వెంట్లు, స్థానికంగా పనిచేస్తున్న 246 మంది దౌత్యవేత్తలు ఉన్నారని సమాచారం. సంబంధిత వర్గాల సమాచారం మేరకు, వీరికి లేఆఫ్ నోటీసుల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. నోటీసులు అందుకున్న దౌత్యవేత్తలు, సివిల్ సర్వెంట్లు 120 రోజుల పాటు సెలవుల్లో ఉంటారని, ఆ తర్వాత వారిని అధికారికంగా ఉద్యోగం నుంచి తొలగించనున్నట్లు తెలుస్తోంది. అయితే, వీరిలో ఎక్కువ మందికి 60 రోజుల సమయం మాత్రమే ఇచ్చినట్లు సమాచారం.

తరువాయి 2లో





## అమెరికా స్వాతంత్ర్య వేడుకలకు హాజరైన సీఎం రేవంత్

- తాజ్ కృష్ణ హోటల్‌లో అమెరికా స్వాతంత్ర్య వేడుకలు
- కాన్సులేట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్‌తో కలిసి పాల్గొన్న ముఖ్యమంత్రి
- భారత్-అమెరికా మధ్య సంబంధాలు క్రమంగా పెరుగుతున్నాయన్న ముఖ్యమంత్రి

హైదరాబాద్‌లో జరిగిన అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తాజ్ కృష్ణ హోటల్‌లో 249వ అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, భారతదేశం,

తరువాయి 2లో

## పన్ను ఎగవేతలు అడ్డుకోవడానికి టెక్నాలజీ ఉపయోగించండి



- అమరావతిలో కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ అధికారుల సమన్వయ సమావేశం
- దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు
- జీఎస్టీ వసూళ్లలో దేశానికి ఏపీ రోల్ మోడల్ లా ఉండాలని ఆకాంక్ష

ఏపీ సీఎం చంద్రబాబు నేడు కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పన్ను ఎగవేతలను అడ్డుకోవడానికి టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించారు. అందుకోసం డేటా అనలిటిక్స్ సాయం తీసుకోవాలని అన్నారు.

**చంద్రబాబు అధికారులకు చేసిన సూచనలు...**

* సమర్థవంతమైన పన్ను వసూళ్ల విధానం ద్వారా జాతీయ సంపదను పెంచాలి. ఆ సంపదను ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వినియోగించాలి
* జీఎస్టీ వసూళ్లలో ఏపీ దేశానికే రోల్ మోడల్ లా ఉండాలి
* జీఎస్టీకి సంబంధించి పొరుగు రాష్ట్రాలతో పోటీ పడేలా యాక్షన్ ప్లాన్ ఉండాలి
* జీఎస్టీ రియలైజేషన్ కోసం కేంద్ర, రాష్ట్ర అధికారుల

తరువాయి 2లో

## గోదావరికి భారీగా వరద నీరు.. కంట్రోల్ రూం నెంబర్లు ఇవే..!

- ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షా లు
- గోదావరికి పెరుగుతున్న వరద ప్రవాహం
- అలర్ట్ జారీ చేసిన ఏపీఎస్‌డీఎంఏ

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదికి వరద ప్రవాహం పెరుగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) ఎండి ప్రఖర్

తరువాయి 2లో



## తెలంగాణలో ఈ నెల 14న కొత్త రేషన్ కార్డుల పంపిణీ!

- తుంగతుర్తిలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రాష్ట్రవ్యాప్తంగా 2.4 లక్షల కొత్త రేషన్ కార్డుల పంపిణీ
- 94,72,422కు చేరనున్న రేషన్ కార్డుల సంఖ్య

తెలంగాణ రాష్ట్రంలో నూతన రేషన్ కార్డులు జారీ ప్రక్రియ ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 14న తుంగతుర్తిలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా కొత్త రేషన్

తరువాయి 2లో




**ఎందరు పిల్లలుంటే అంత సంతోషమని ఆ సినిమాలో చూపించారు: సీఎం చంద్రబాబు** 2లో

## ఐదు దేశాల పర్యటనను ముగించుకుని భారత్‌కు చేరుకున్న మోదీ

(మొదటిపేజీ తరువాయి)

మధ్య సమాచార సమన్వయం ఉండాలి

ఎగవేతలను గుర్తించేందుకు విద్యుత్ వినియోగం తదితర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి

ఏపీలో ఎక్కడా పన్ను ఎగవేతలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలి

జీఎస్టీ రిజిస్ట్రేషన్లలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలి

## వందలాది మంది దౌత్యవేత్తలు, సివిల్ సర్వెంట్లకు ట్రంప్ ప్రభుత్వం షాక్!

(మొదటిపేజీ తరువాయి)

శాఖల పునర్వ్యవస్థీకరణలో భాగంగా దౌత్య ప్రాధాన్యతలపై దృష్టి సారించామని తాజా నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ట్రంప్, విదేశాంగ మంత్రి మార్కో రుబియోతో పాటు వారి మిత్రపక్షాలు ఈ నిర్ణయాన్ని సమర్థిస్తున్నాయి. అయితే, ప్రస్తుత మరియు మాజీ దౌత్యవేత్తలు మాత్రం దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ చర్యల వలన విదేశాల్లో ఇప్పటికే ఉన్న ముప్పుతో పాటు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం బలహీనపడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాల కోతలను నిలిపివేయాలని కోరుతూ అమెరికన్ ఫారెన్ సర్వీసెస్ అసోసియేషన్ గత నెలలోనే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. విదేశీ సేవలు అందించే ఈ విభాగానికి అంతరాయం కలిగించడం జాతీయ ప్రయోజనాలను ప్రమాదంలో పడేస్తుందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికన్లపై దీని ప్రభావం పడుతుందని సంస్థ అధ్యక్షుడు టామ్ ఆందోళన వ్యక్తం చేశారు.

## అమెరికా స్వాతంత్ర్య వేడుకలకు హాజరైన సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

అమెరికా మధ్య దౌత్య సంబంధాలు 1947లో ప్రారంభమై నేటి వరకు రాజకీయ, ఆర్థిక, వాణిజ్య, విద్య, సాంకేతిక రంగాల్లో మరింత దృఢంగా మారాయని అన్నారు. ఈ వేడుకలో భారత్‌అమెరికా స్నేహ సంబంధాలను గుర్తు చేస్తూ, రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఢిల్లీలో భూప్రకంపనలు..ఈ వారంలో రెండోసారి

(మొదటిపేజీ తరువాయి)

హర్యానాలో ఇది రెండో భూకంపం. ఈ భూకంపం దాటికి ఢిల్లీతో పాటు సమీప ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చాయి.రాత్రి 7.49 గంటలకు భూకంపం సంభవించిందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ తెలిపింది. హర్యానాలోని రోహ్తక్, బహదూర్‌గఢ్ జిల్లాల్లో కూడా ప్రకంపనలు సంభవించాయి. నిన్న ఉదయం ఝజ్జర్‌లో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించింది. నిన్న కూడా ఢిల్లీ సహా పలు ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చాయి.

## తెలంగాణలో ఈ నెల 14న కొత్త రేషన్ కార్డుల పంపిణీ!

(మొదటిపేజీ తరువాయి)

కార్డుల జారీ నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీ కోసం దరఖాస్తులను స్వీకరించింది. ఇదివరకే కొంతమందికి రేషన్ కార్డులను ప్రభుత్వం అందజేసింది. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 2.4 లక్షల కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. దీని ద్వారా దాదాపు 11.30 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. గత ఆరు నెలల కాలంలో ప్రభుత్వం 41 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసింది. తాజాగా పంపిణీ చేయనున్న వాటితో కలిపి రాష్ట్రంలో రేషన్ కార్డుల సంఖ్య 94,72,422కు చేరుకుంటుంది. వీటి ద్వారా మొత్తం 3.14 కోట్ల మందికి ప్రయోజనం కలగనుంది.

## తలసేమియాపై అవగాహన..
### ఈనెల 19న విశాఖ ఆర్కే బీచ్‌లో రన్

విశాఖ: తలసేమియాపై అవగాహన కోసం విశాఖపట్నంలోని ఆర్కే బీచ్‌లో 10కె, 5కె, 3కె రన్ నిర్వహించనున్నారు. సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నేతృత్వంలో ఈనెల 19న సాయంత్రం ఈ కార్యక్రమం జరగనుంది. రన్‌లో ఒలింపిక్ పతక విజేత కరణం మల్లీశ్వరి పాల్గొననున్నారు. రన్ తర్వాత తమన్, సమీరా భరద్వాజ్ నేతృత్వంలో మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నారు. రన్‌లో పాల్గొనేవారు www.thalassemiarun.comలో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు.



## గోదావరికి భారీగా వరద నీరు..
# కంట్రోల్ రూం నెంబర్లు ఇవే..!

(మొదటిపేజీ తరువాయి)

జైన్ శుక్రవారం వెల్లడించారు. నదిలో నీటిమట్టం పెరుగుతున్న దృష్ట్యా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలు, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 37.2 అడుగులకు చేరుకుందని ప్రఖర్ జైన్ తెలిపారు. అదేవిధంగా, ధవళేశ్వరం వద్ద ప్రస్తుతానికి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 2.9 లక్షల క్యూసెక్కులుగా నమోదైందని పేర్కొన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో, దిగువ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్‌డీఎంఏ హెచ్చరించింది. వరద పరిస్థితుల దృష్ట్యా, ప్రజలు అత్యవసర సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే స్టేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 112, 1070, 1800 425 0101 ను సంప్రదించాలని అధికారులు సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, కొన్ని కీలక సూచనలను ఏపీఎస్‌డీఎంఏ జారీ చేసింది. బోట్లు, మోటార్ బోట్లు, స్టీమర్లతో నదిలో ప్రయాణించవద్దని స్పష్టం చేసింది. అలాగే, వరద నీటిలో ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం, స్నానాలకు వెళ్లడం వంటివి పూర్తిగా నివారించాలని హెచ్చరించింది. స్థానిక అధికారులు, విపత్తు నిర్వహణ బృందాలు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నాయని, ప్రజలు వారి సూచనలను తప్పక పాటించాలని ప్రఖర్ జైన్ కోరారు.

## ఎందరు పిల్లలుంటే అంత సంతోషమని
# ఆ సినిమాలో చూపించారు: సీఎం చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

**హాజరైన సీఎం చంద్రబాబు**

**జనాభా పెరగాలని పిలుపు**

దేశానికి బలమైన ఆర్థికవనరు జనాభేనని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. జనాభా పెరుగుదలకు త్వరలో మంచి పాలసీ తీసుకొస్తామని అన్నారు. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని చెప్పిన గురజాడ అప్పారావు స్ఫూర్తితో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. నాడు ఎన్టీఆర్ తాతమ్మ కల అనే సినిమా తీశారని, ఎందరు పిల్లలుంటే అంత సంతోషమని అందులో చూపించారని వివరించారు. పిల్లలను కనే వరం భగవంతుడు మహిళలకు ఇచ్చాడని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్ర సచివాలయం వద్ద ప్రపంచ జనాభా దినోత్సవంపై మొదటి అమరావతి సమ్మిట్‌కు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జనాభా నిర్వహణా విధానం ప్రతి కుటుంబం ముఖ్యంమీ అభిప్రాయం మార్గదర్శనం అనే కాన్సెప్ట్‌తో రూపొందించిన సర్వేను సీఎం ప్రారంభించారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించారు.

**ప్రత్యుత్పత్తి రేటు పెరగాలి**

ఒకప్పుడు జనాభా పెద్ద సమస్యగా ఉండేది. 2004కు ముందు సీఎంగా ఉన్నప్పుడు జనాభా నియంత్రణకు ప్రోత్సాహకాలు ఇచ్చాను. ఇద్దరు పిల్లల కంటే ఎక్కుమంది ఉంటే స్థానిక సంస్థల్లో పోటీకి అనర్హులని చేస్తూ చట్టాన్ని తెచ్చాను. ఇప్పుడు ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉన్నవారు స్థానిక సంస్థల్లో పోటీకి అర్హులుగా చట్టం తీసుకురావాల్సిన అవసరం ఏర్పడింది. దేశం అంటే రాష్ట్రాలు, ప్రాంతాలు, పట్టణాలు, సరిహద్దులు, భూభాగాలు మాత్రమే కాదు, దేశం అంటే మనుషులు.

**మన బలం మానవ వనరులు**

ఈ రోజు ప్రపంచంలో 10 నుంచి 24 ఏళ్ల వయసు ఉన్నవారు 1.8 బిలియన్లు ఉన్నారు. ఒకప్పుడు జనాభా ఎక్కువ ఉన్న దేశాలను చులకనగా చూసేవారు. కానీ జనాభా ఉన్న దేశాలవైపే అగ్రరాజ్యాలు చూడాల్సి వస్తోంది. జనాభా ఎప్పటికీ భారం కాదు...అదే మనకు తిరుగులేని ఆస్తి. ఎక్కువ జనాభా ఉన్న మన దేశంలో అభివృద్ధి సాధ్యమా అనే పరిస్థితి నుంచి ఆ జనాభానే మనకు అడ్వాంటేజ్‌గా



మారింది. 140 కోట్ల జనాభా కలిగి ఉన్న మన దేశం చైనాను కూడా వెనక్కు నెట్టింది.

* **యువశక్తి తగ్గి... వృద్ధులు పెరుగుతున్నారు**

ఏ దేశంలోనైతే వయోజన సమస్య వస్తుందో అక్కడ వృద్ధిరేట్ నిలిచిపోతుంది. భవిష్యత్‌లోనూ సమస్యలు వస్తాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో సంతానోత్పత్తి రేట్ పడిపోతోంది. అమెరికాలో 1.62 శాతం, యూకేలో 1.54 శాతం, హంగేరిలో 1.50 శాతం, ఫ్రాన్స్‌లో 1.49 శాతం, రష్యాలో 1.47 శాతం, జర్మనీలో 1.46 శాతం, కెనడాలో 1.33 శాతం, జపాన్‌లో 1.23 శాతం, చైనాలో 1.02 శాతం, సింగపూర్‌లో 0.96 శాతం ఉంది. సంపన్న దేశాల్లో తక్కువ జననాల రేటు కన్పిస్తోంది.

* **పిల్లలను కనేవారికి విదేశాల్లో ప్రోత్సాహకాలు**

జపాన్‌లో పిల్లలు స్కూలుకు వెళ్లే వరకు చైల్డ్ కేర్ సేవలను అందించడంతో పాటు పిల్లల చదువుకు ఆర్థిక సాయం లేదా ఉచిత విద్యను అందిస్తున్నారు. ఎక్కువమంది పిల్లలుంటే ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయంతో పాటు తక్కువ రెంట్‌తో ఇల్లు అద్దెకు ఇస్తున్నారు. దక్షిణ కొరియా దేశంలో నెలవారీగా ప్రత్యక్ష నగదు బహుమతులు అందించడంతోపాటు వివాహం, కాన్పులకు, ఐవీఎఫ్ గర్భధారణకు సాయం చేస్తున్నారు. సింగపూర్ దేశంలో బేబీ బోనస్ స్కీమ్ కింద పుట్టిన ప్రతి శిశువు కోసం కొంత నగదు అందిస్తున్నారు. మ్యాచ్ సేవింగ్స్ కింద ప్రభుత్వ సొమ్మును జోడించి పిల్లల ఖాతాల్లో వేస్తున్నారు. రష్యాలో రెండవ బిడ్డను కంటే ఫ్రీ హెల్త్‌కేర్ కింద గర్భిణీలకు ఉచిత వైద్యం అందిస్తున్నారు. హంగేరీలో నలుగురు కంటే ఎక్కువ పిల్లులు ఉన్న వారికి జీవితాంతం ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇస్తున్నారు. చైనాలో ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలుంటే రూ.12 లక్షలు ఆర్థిక సాయం చేస్తున్నారు.

* **ఖర్చులు పెరుగుతున్నాయని పిల్లల్ని కనడం లేదు**

జనాభా తగ్గిపోతే వృద్ధి రేటు పడిపోతుందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా పెరుగుదలపై సమావేశంలో పోల్ నిర్వహిస్తే ఇద్దరు పిల్లలుండాలని 67.41 శాతం మంది, ఒకరే ఉండాలని 12.34 శాతం మంది, ముగ్గురు పిల్లలుండాలని 19.88 శాతం మంది అభిప్రాయపడ్డారని వివరించారు. పిల్లలను కనడానికి యువత ఆస్తకి చూపడం లేదని, చాలా మంది భార్యాభర్తలు పిల్లలను వద్దనుకునే పరిస్థితికి వచ్చారని అన్నారు. ఖర్చులు పెరుగుతాయని పిల్నల్లి కనడానికి ఇష్టపడటం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

* **ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్నాయి**

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి... రానురాను అవి కనుమరుగవుతున్నాయి. గత కొన్నేళ్ల వరకు ఇంట్లో ప్రతి ఒక్కరికీ 5 కేజీల చొప్పున బియ్యం ఇచ్చేవాళ్లం. ఐదుగురు ఉంటే 25 కేజీలు ఇచ్చేవాళ్లం. అంతకంటే ఎక్కువమంది ఉంటే బియ్యం ఇచ్చేవాళ్లం కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఒక కుటుంబంలో పది మంది ఉన్నా 50 కేజీల కంటే ఎక్కువ ఇచ్చేదానిపై ఆలోచిస్తున్నాం. దక్షిణ భారత దేశంలో జనాభా తగ్గిపోతుండడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. భవిష్యత్‌లో పార్లమెంటు సీట్లు పెరుగుతాయి.. కానీ దక్షిణ భారత దేశంలోని రాష్ట్రాలకు సీట్లు తగ్గిపోతాయని కొందరు ఆందోళన చెందుతున్నారు... అని చంద్రబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ మహేంద్ర దేవ్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మైనా మహిళా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సుహానీ జలోటా, పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ ఎమ్.ప్రకాశమ్మ, ప్రొఫెసర్ సంజయ్ కుమార్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మెగా పీటీఎం 2.0 గ్రాండ్ సక్సెస్ అయింది: మంత్రి నారా లోకేశ్

* **ఏపీ వ్యాప్తంగా నిన్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 2.0**
* **అందరికీ కృతజ్ఞతలు తెలిపిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్**
* **ఇలాంటి కార్యక్రమాలో విద్యార్థుల భవితకు బంగారు బాట వేయొచ్చని వెల్లడి**



రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం) 2.0' కార్యక్రమం విజయవంతం అయిందని చెబుతూ రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సమష్టికృషితోనే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. సమాజం స్వచ్ఛందంగా అందించిన మద్దతు విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం పెంచడం, విద్యార్థుల ప్రగతిని సమీక్షించడం, పాఠశాలల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు.'మెగా పీటీఎం 2.0' ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల పెంపునకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించడం జరిగిందని మంత్రి వివరించారు. తల్లిదండ్రుల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను స్వీకరించి, వాటిని అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని, విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని నారా లోకేశ్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నూతనోత్సాహం నింపడమే కాకుండా, వారి భవిష్యత్ నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్రను మరింత క్రియాశీలం చేసిందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# కాంగ్రెస్ ప్రజా పాలనలో తెలంగాణలో పండగ వాతావరణం

* **ఇందిరమ్మ ఇండ్లతో నెరవేరుతున్న పేదల సొంతింటి కల**
* **కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌ఛార్జి కేకే మహేందర్**





ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: కాంగ్రెస్ ప్రజా పాలనలో తెలంగాణలో పండగ వాతావరణం నెలకొందని కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌ఛార్జి కేకే మహేందర్ అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని మాతృశ్రీ గార్డెన్స్‌లో ముస్తాబాద్ మండల కేంద్రం, గూడెం, కొండాపూర్ గ్రామాలకు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టా పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ సందీప్ కుమార్ , కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల ప్రొసిడిరగ్స్ అందజేశారు. అనంతరం కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌ఛార్జి కేకే మహేందర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ప్రతి పేదవాడికి ఇస్తామని చెప్పి పేద ప్రజలను మోసం చేసింది అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని వాటిని పూర్తి చేసి అర్హులైన పేదవాళ్లకు పంపిణీ చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఇందిరమ్మ ఇండ్లతో పేదల సొంతింటి కల నెరవేరుతున్నదని తెలిపారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో ఆనాడు గత ప్రభుత్వం నిజమైన అర్హులకు కాకుండా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అనర్హులకు ఇచ్చారని, అందులో ఆరు ఖాళీగా ఉండటంతో అధికారులు గుర్తించి నిజమైన అర్హులను వారి ఎంపిక చేసి ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లో మంచి పేరు సంపాదించుకుంటుందనే అక్కస్సుతో ఇక్కడ ప్రాతినిత్యం వహిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్ సిఎంపై ఇష్టానుసారంగా మాట్లాడడం చూస్తుంటే అధికారం కోల్పోయాక ఎంపీ ఎలక్షన్లో డిపాజిట్లు కోల్పోయాక ఆయన మతి పూర్తిగా పోయినట్టు కనిపిస్తుందని, ఎన్ని పిచ్చి వేషాలు వేసిన ప్రజలు మీ మాట వినే పరిస్థితిలో లేరని అన్నారు. ప్రజా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్తు, మహిళా మణులను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా వారిచే పెట్రోల్ బంకులు, ఎలక్ట్రికల్ బస్సులను కొనుగోలు చేయిస్తూ వారికి వారి కాళ్లపై నిలబడేలా ఆర్థిక చేతన అందించే ప్రభుత్వం దేశంలో ఏదైనా ఉంది అంటే అది కాంగ్రెస్ అన్నారు. దేశానికి వెన్నుముకైన రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి రైతు భరోసా కింద పెట్టుబడి సహాయాన్ని అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు. రాబోయే మూడు సంవత్సరాలలో కూడా అర్హులైన ప్రతి పేదవారికి ఇల్లు ఇప్పించే బాధ్యత నాదని అన్నారు. అధైర్య పడవద్దు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం గూడెం గ్రామం పరిధిలోని నూతనంగా కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం చేసి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

## ఘనంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలను ముస్తాబాద్ మండలంలో ఘనంగా నిర్వహించారు. బిజెపి ముస్తాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివేక నంద విగ్రహం వద్ద కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలున్నారు.

## తెలంగాణ లేని భారత దేశ పటాన్ని ఇవ్వడాన్ని ఖండించిన బిఆర్ఎస్



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్‌కు బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తెలంగాణ లేని భారత దేశ పటాన్ని ఇవ్వడాన్ని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపల్లి సురేందర్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ముస్తాబాద్ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 11 సంవత్సరాలుగా భారత దేశంలో నూతనంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రాన్ని ఎంతో గొప్పగా పాలించడం, దానికి భారతదేశంలోనే పల్లె ప్రగతి కార్యక్రమానికి దేశం మొత్తం 32 అవార్డులు ప్రకటిస్తే ఒక తెలంగాణ రాష్ట్రానికి 19 పథకాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ఇలాంటి అనేక కార్యక్రమాలతో దేశంలోనే నెంబర్ వన్ స్థానాన్ని మాజీ సీఎం కెసిఆర్ నాయకత్వంలో సాధించుకొని, కేంద్రంలో శభాష్ అనిపించుకోవడం జరిగిందని అన్నారు. తెలంగాణ లేని భారతదేశ చిత్రపటాన్ని ఎపి మంత్రికి ఇవ్వడంతో తెలంగాణ రాష్ట్రం అంటే బిజెపి వారికి ఎలాంటి కక్ష ఉందోననేది ప్రజలు అందరూ గమనించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు సర్వర్ పాషాచ ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు ఎద్దండి నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు దబ్బెడ రాజుఉన్నారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

* **ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంద. నాగక్రిష్ణ , బయ్య అభిమన్యు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంద. నాగక్రిష్ణ , బయ్య అభిమన్యు లు అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంద నాగకృష్ణ , బయ్య అభిమన్యు లు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కళాశాలలలో విద్యను అభ్యసిస్తున్న సైన్స్ విద్యార్థులకు సరైన ప్రయోగశాలలు లేకపోవడంతో వారు ప్రయోగాలు చేయడంలో వెనుకంజలో ఉన్నారని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల గడుస్తున్నప్పటికీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిని వారు ఖండించారు. కళాశాలలలో మరుగుదొడ్లు, ప్రహరీగోడలు సరిగ్గా లేక విద్యార్థుల నానా అవస్థలు పడుతున్నారన్నారు. వర్షాకాల నేపథ్యంలో కళాశాలల భవనములు శిథిలావస్థలో ఉండుట కారణంగా గోడలు తడిచి విద్యార్థులు కరెంట్ షాక్కు గురయ్యే అవకాశాలు ఉన్నాయని వాటి స్థానంలో అదనపు గదులు అదన భవనాలు నిర్మించాలని వారు అధికారులను డిమాండ్ చేశారు. ఇన్ని సమస్యల వలయంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉండట కారణంగా విద్యార్థులు వీటిలో చేరడానికి ఎక్కువగా మొగ్గుచూపడం లేదని , సమస్యలను పరిష్కరించని పక్షాన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దశల వారి పోరాటాలను నిర్వహిస్తామని జిల్లా అధికారులను, ప్రభుత్వాన్ని వీరు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ కొత్తగూడెం టౌన్ నాయకులు సాయి సంతోష్ , కళాశాల నాయకులు అంజి , విగ్నేష్ , భరత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మెగా ఆధార్ క్యాంపులు ప్రజల నుండి విశేష స్పందన

* **3,700కి పైగా ఆధార్ సమస్యలకు పరిష్కారం : జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మూడు రోజుల మెగా ఆధార్ క్యాంపులు ప్రజల నుండి విశేష స్పందనను పొందాయి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒకప్రకటన లో తెలిపారు. మూడు రోజులపాటు జరిగిన ఈ మెగా క్యాంపు ద్వారా వేలాది మంది పౌరులు తమ ఆధార్ సంబంధిత సమస్యలను పరిష్కరించుకున్నారు అన్నారు. మూడు రోజులు పాటు నిర్వహించిన ఈ మెగా ఆధార్ క్యాంపు ద్వారా మొత్తం కొత్త నమోదులు - 489, వయోవృద్ధుల సేవలు - 45, వికలాంగుల నమోదు - 12, ట్రాన్స్‌జెండర్ నమోదు - 1, బయోమెట్రిక్, ఇతర అప్డేట్లు - 602, జనన తేదీ సవరణ లు (డేట్ అఫ్ బర్త్ సంబంధించి) - 5, ఆధార్ రద్దు కేసులు - 2 సాధారణ ఎంక్వయిరీలు - సుమారు 50 , మొత్తం - 3,772 సమస్యలను పరిష్కరించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ మెగా ఆధార్ క్యాంపకు పదివేలకు పైగా ప్రజలు వచ్చారని ఆయన తెలిపారు. వారిలో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి, ధ్రువీకరణ పత్రాలు తీసుకొని మీసేవ కేంద్రాల ద్వారా ఆధార్ నవీకరణ చేసుకోవాలని సూచించారు. చాలా రోజులుగా పరిష్కారానికి నోచుకోని ఎన్నో ఆధార్ సమస్యలను ఈ ఆధార్ కేంద్రం ద్వారా పరిష్కరించబడ్డాయని అన్నారు.ఈ కార్యాక్రమం ద్వారా ప్రజలకు నేరుగా సేవలు అందించడం ద్వారా వారి సమస్యలు తక్షణమే పరిష్కరమయ్యాయి అన్నారు. మండలాల వారీగా నిర్వహించే మెగా ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకొని ఆధార సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ ప్రజలను కోరారు. ఈ మెగా ఆధార్ క్యాంపును విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన రాష్ట్ర యుఐడిఐ బృందం , ఈ డిస్టిక్ మేనేజర్ సైదేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది ,ఐటీ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

## సింగరేణి మహిళా జూనియర్ కళాశాలలో ఔషధ మొక్కలు నాటిన మొక్కల రాజశేఖర్




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రకృతి హరిత దీక్షలో భాగంగా శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి మహిళా జూనియర్ కళాశాలలో 1837వ రోజు ఔషధ మొక్కలు నాటిన మొక్కల రాజశేఖర్, ప్రకృతి హరిత దీక్షపరాలు నైనిక రజువా అదేవిధంగా ఔషధ మొక్కలను, విత్తనాలను అందజేశారు. ఔషధ మొక్కల వల్ల కలిగి ఉపయోగాలను ఆయన వివరించారు.ఔషధ మొక్కలు అనేవి ప్రకృతి మనకు ఇచ్చిన అమూల్యమైన వరం. ఇవి ఆరోగ్యాన్ని కాపాడడంలో, వ్యాధుల నివారణలో, చికిత్సలో కీలక పాత్ర పోషిస్తాయి. కొన్ని ముఖ్యమైన ఔషధ మొక్కల ఉపయోగాలను వాటి లాభాలను కలిగే లాభాల కోసం ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో మహిళ కళాశాల లెక్చరర్లు భాగ్యమ్మ, స్పందన, రికార్డ్ అసిస్టెంట్ హిమాము తదితరులు పాల్గొన్నారు

## వన మహోత్సవ లక్ష్యాలను సాధించాలి

* **అదనపు కలెక్టర్ విద్యా చందన**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: వన మహోత్సవ లక్ష్యాలను సాధించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన మండలంలోని పలు గ్రామాలను సందర్శించి వన మహోత్సవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు.ఈ పర్యటనలో భాగంగా మైలవరం గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. అనంతరం అదే గ్రామంలో రైతు లక్ష్మీనరసు పొలంలో మునగ సాగుకు ప్రోత్సాహం ఇస్తూ మునగ మొక్కను నాటి ప్రారంభం చేశారు.తర్వాత మైలారం గ్రామంలోని జెడ్‌పిఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మునగ, వెలగా, ఉసిరి మొక్కలను నాటి విద్యార్థులలో పర్యావరణం పై , ఔషధ మొక్కలపై అవగాహన కల్పించాలని అన్నారు.పాఠశాల ఆవరణంలో నిర్మించిన “కమ్యూనిటీ మ్యాజిక్ సోక్ పిట్” ను పరిశీలించి, శుభ్రత పట్ల అవగాహన కల్పించే విధంగా దీనిని వినియోగించుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందుతున్న పోషకాహారం, వృద్ధి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మైలవరం గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీను , గట్టుమల్ల నర్సరీలను సందర్శించిన ఆమె మొక్కల లభ్యతను పరిశీలించారు. ఆయా నర్సరీల్లో వివిధ రకాల మొక్కల నిల్వలు, పంపిణీ విధానాలు, మొక్కల ఆరోగ్యం తదితర అంశాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంపీ ఓ, పంచాయతీ కార్యదర్శులు, ప్లాంటేషన్ మేనేజర్ రాజు, ఏపీవో, ఈసీ, టి ఏ, ఎఫ్ ఏ గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**: (ఎస్ఎస్ఎస్) బండ శ్రీధర్ రెడ్డి**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సమాచార హక్కు సాధన స్రవంతి సంస్థ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బండ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీఐ ఆక్టివిస్ట్ బోడికల ప్రేమ్ దయాళ్ జిల్లా విద్యశాఖ అధికారి వెంకటేశ్వర చారి ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీవో ఎంఎస్ నెంబర్ 1 కి విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలో సరైనా మౌలిక సదుపాయాలు ప్లే గ్రౌండ్స్ , ఫైర్ సేఫ్టీ అనుమతులు లేకుండా ఇరుకు గదుల్లో పాఠశాలలు నిర్వహిస్తూ విద్యాసంస్థలు వ్యాపార సంస్థలుగా మారుతున్నాయని, పాఠశాలల విద్యాహక్కు చట్టం, ఫండమెంటల్ రైట్ అఫ్ ఎడ్యుకేషన్ ప్రమాదంలో పడుతుందని, తక్షణమే ఎంఈఓ లతో ప్రతిఒక్క ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ నిర్వహించి ప్రైవేట్ విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫార్మ్స్ అమ్మకాలు నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను పాటించని విద్య సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అన్ని విద్యాసంస్థలను స్వయంగా తనిఖీలు నిర్వహించలని, తనిఖీలలో వారిని కూడా భాగస్వాములు చేయలని, చట్టాన్ని ఉల్లంఘించిన విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేసే విధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఇందులో భాగంగా సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం, సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ కోరిన సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధిరులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాసాల.మురళీ మోహన్, గంద్ర. జితేందర్ రెడ్డి, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సు ఢీకొని విద్యార్థికి తీవ్ర గాయాలు – కుషాయిగూడలో విషాదం

ప్రజాస్ఫూర్తి , కాప్రా: మేడ్చల్ జిల్లా కుషాయిగూడలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలో శుక్రవారం ఉదయం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అదే పాఠశాలకి చెందిన బస్సు ఓ విద్యార్థిని ఢీకొనడంతో, అతనికి తీవ్ర గాయాలు అయ్యాయి. చైతన్య గోపిశెట్టి అనే 6వ తరగతి విద్యార్థి, కుషాయిగూడ సుభాష్ చంద్ర బోస్ నగర్ కాలనీకి చెందినవాడు. ఉదయం 8 గంటల సమయంలో సైకిల్‌పై స్కూల్‌కి వస్తుండగా, టీఎస్ 08 యు 1780 నంబర్ గల అక్షర స్కూల్ బస్సు అతడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలుడి చెయ్యి తీవ్రంగా నుజ్జునుజ్జు






అయ్యింది.తక్షణమే స్థానికులు స్పందించి బాలుడిని యశోద హాస్పిటల్, సికింద్రాబాద్‌కి తరలించారు. ప్రస్తుతం అతనికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఘటనకు కారణమైన బస్సు డ్రైవర్‌ను కుషాయిగూడ పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.పాఠశాల ప్రాంగణం వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని, సంఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. తల్లిదండ్రులు, స్థానికులు స్కూల్ యాజమాన్యంపై నిరసన వ్యక్తం చేశారు.

## భద్రాచలం కరకట్ట వద్ద గోదావరి నది ఉధృతిని పరిశీలించిన జిల్లా ఎస్పీ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఎగువన కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి నది ఉధృతి పెరుగుతున్నందున లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. శుక్రవారం భద్రాచలం కరకట్ట వద్ద గోదావరి నది ఉధృతిని పరిశీలించి అక్కడ ఉన్న అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు.విపత్కర సమయాలలో ప్రజలకు అండగా ఉండేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు సిద్ధంగా ఉందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీసు వారి సేవలు వినియోగించుకోవాలని సూచించారు.వరదల నేపథ్యంలో పోలీసు శాఖ తరఫున ఐదు డిడిఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

## జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి , కాప్రా : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కి ఆయురారోగ్యాలతో పాటు ప్రజాసేవలో మరింత శ్రేయస్సు కోరి అభినందనలు తెలియజేశారు.ఈ శుభ సందర్భంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్, గంధం నాగేశ్వర్ రావు, మహేష్ గౌడ్, లక్ష్మి నారాయణ, నాగారం బాబు సహా బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జన్మదినాన్ని జరిపారు. పార్టీ శ్రేణులు పల్లా రాజేశ్వర్ రెడ్డి నేతృత్వాన్ని ప్రశంసిస్తూ, ఆయన ప్రజా సంక్షేమానికి అంకితభావంతో పని చేస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

## విత్తనాల సేకరణలో ఆసక్తి చూపిన విద్యార్థికి ప్రోత్సాహం




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణవాతావరణ సమతుల్యత, చెట్ల పెంపకం పట్ల పూర్తి అవగాహన కలిగించాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పాఠశాల విద్యార్థులచే విత్తనాల సేకరణ అనే వినూత్న పథకాన్ని ప్రవేశపెట్టారు. దీనికై బహుమతులను కూడా ప్రకటించారు. కొత్తగూడెం మండలంలోని రెండు కాంప్లెక్స్ లలో రామవరం, కూలీలైన పాఠశాలలు విజేతలుగా నిలువగా, మండల స్థాయిలో రామవరం ప్రథమ స్థానంలో నిలిచింది. కాగా కూలీలైన పాఠశాల 10వ తరగతి విద్యార్థి సంతోష్ కుమార్ స్వయంగా ప్రత్యేక ఆసక్తిని కనబరుస్తూ 30 రకాల విత్తనాలను సేకరించాడననే సమాచారంతో మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభు దయాల్, విద్యార్థి గూర్చి తెలుసుకొని ప్రోత్సాహిస్తూ నూతన వస్త్రాలు, స్టడీ మెటీరియల్, బూట్లను బహుకరించారు. తండ్రి కూలీ అయిన తరగతిలో ప్రథమ స్థానంలో నిలవడం పట్ల హర్షం ప్రకటిస్తూ, పట్టుదలతో కష్టపడి చదువుతూ ఉన్నత భవిష్యత్తును సాధించాలన్నారు.

## పూసగుప్ప గ్రామంలో మొబైల్ హాస్పిటల్, అంబులెన్సు సేవలు ప్రారంభం

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: చర్ల మండలంలోని చత్తీస్గడ్ రాష్ట్ర సరిహద్దు గ్రామమైన పూసుగుప్పలో శుక్రవారం మొబైల్ హాస్పిటల్ , అంబులెన్స్ సేవలను ప్రారంభించడం జరిగింది.భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తో పాటు, జిల్లా కలెక్టర్ జితేష్.వి పాటిల్,ఎస్పీ రోహిత్ రాజు లు పాల్గొన్నారు.స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ నిధుల ద్వారా విడుదలైన కోటి రూపాయల వ్యయంతో ఈ మొబైల్ హాస్పటల్ ను నిర్మించడం జరిగింది.చర్ల మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ ప్రజల సంక్షేమం కోసం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సారథ్యంలో పోలీస్ శాఖ విశేష సేవలను అందిస్తుందని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. పూసుగుప్ప గ్రామ పరిసర ప్రాంతాల్లో ఎవరికైనా అత్యవసర చికిత్స అవసరమైతే భద్రాచలం,కొత్తగూడెం పట్టణాలకి వెళ్లడానికి ఒకప్పుడు సరైన రహదారి కూడా లేదని,కానీ ఇప్పుడు ఇదే పూసుగుప్ప గ్రామానికి చర్ల నుండి అరగంట వ్యవధిలోనే చేరుకునే విధంగా రహదారిని , ఇప్పుడు ఈ హాస్పిటల్ ని ప్రారంభించడంలో చర్ల పోలీసుల కృషి ఎంతగానో ఉందని అన్నారు.ఆదివాసీ ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రి సేవలను పరిసర ప్రాంతాల ప్రజలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున అందవలసిన సంక్షేమ పథకాలు కానీ,అభివృద్ధి కార్యక్రమాలు గానీ ఆదివాసీ ప్రజలకు అందజేయడంలో జిల్లా పోలీసుల కృషి అభినందనీయం అన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ప్రజలకు విద్య,వైద్యం,రవాణా వంటి కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా జిల్లా అధికార యంత్రాంగం పనిచేస్తుందని తెలిపారు.అనంతరం ఎస్పీ



రోహిత్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున పోలీస్ శాఖ ఏజెన్సీ ప్రాంతవాసులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.ఎలాంటి సమస్యలున్నా సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించడంలో స్థానిక పోలీసు అధికారులు ఎల్లప్పుడూ ఆదీవాసీ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ తమ తమ ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు.సరిహద్దు చత్తీస్గడ్ రాష్ట్ర గ్రామాలైన రాంపురం,భీమారం గ్రామాల ప్రజలు కూడా ఈ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.అనంతరం అంబులెన్స్ వాహన సేవలను ప్రారంభించారు.ఇటీవల పూసుగుప్ప నుండి రాష్ట్ర సరిహద్దు వరకు నూతనంగా నిర్మితమైన బీటి రోడ్డును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్,చర్ల ఇన్స్పెక్టర్ రాజు వర్మ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్స్ చెన్నూరి శ్రీనివాస్, ఇ.శ్రీనివాస్, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ , ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి పాఠశాలలో కూడా ఖచ్చితంగా ప్రహరీ క్లబ్లను ఏర్పాటు చేయాలి

*** బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కి వినతి**

హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రతి పాఠశాలలో కూడా ఖచ్చితంగా ప్రహరీ క్లబ్లను ఏర్పాటు చేయాలని బాలల హక్కుల పరిరక్షణా కమీషను మెంబర్లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజా పాలన, ప్రజాభివృద్ధిలో భాగంగా తెలంగాణ రాష్ట్ర జవహర్ బాల్ మంచ్ చైర్మన్ మామిడి రిషికేశ్ రెడ్డి , రాష్ట్ర కోఆర్డినేటర్ జిట్టా సునీల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం బాలల హక్కుల పరిరక్షణా కమీషను మెంబర్లు విద్యా కమిషన్ మెంబర్ ప్రొఫెసర్ పి ల్ విశ్వేశ్వరరావు ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణా కమీషను మెంబర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో నలుమూలలా పేరుకుపోయిన డ్రగ్ మాఫియాను కూకటివేలతో పెకిలించి డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేసే దాంట్లో భాగంగా రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులను, ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను సభ్యులుగా చేస్తూ ప్రహరీ క్లబ్ ను కచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. 2024 జూలై నెలలో ప్రభుత్వం ఉత్తర్వులను ఆదేశించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి ప్రభుత్వ పాఠశాల ప్రైవేట్ పాఠశాల నందు కచ్చితంగా రాష్ట్ర ఆదేశాలనుసారంగా ప్రహరీ క్లబ్లను ఏర్పాటు చేసి రాష్ట్రంలో డ్రగ్ రూపుమాపడంలో రాష్ట్ర అధికారులు విద్యాశాఖ అధికారులు ముందుండి భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో తమ వంతు పాత్రను పోషించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణా కమీషను మెంబర్లు బి. వచన్ కుమార్,ఎం. చందన ,కె. వందన గౌడ్, ప్రేమలత అగర్వాల్ , జవహర్ బాల్ మంచ్ సభ్యులు పిఎల్. ప్రవీణ్ కుమార్,ఎన్. సాయి కృష్ణ,వి. సంతోష్,జీ. జనీష్, మైతి, పూజ పాల్గొన్నారు .




## జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్లపల్లి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రజాస్ఫూర్తి , కాప్రా :జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఐదవ సాధారణ స్టాండింగ్ కమిటీ సమావేశంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్‌తో పాటు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ని కలిసి, చర్లపల్లి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా శివ సాయి నగర్ నుండి కుషాయిగూడ డి మార్ట్ వరకు మొదటి విడత బాక్స్ డ్రెయిన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి,




రెండవ విడతగా డి మార్ట్ నుండి సాయి నగర్, కృష్ణారెడ్డి నగర్ వరకు పనులను తక్షణమే ప్రారంభించాలని కోరారు. ఇందిరా క్యాంటీన్‌లో ఉదయం టిఫిన్ సర్వీస్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. కుషాయిగూడ, నాగార్జున కాలనీ, ఇందిరానగర్, పెద్ద చర్లపల్లి, చిన్న చర్లపల్లి, హుకట్ నగర్, భరత్ నగర్ వంటి కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని.ప్రస్తుతం చర్లపల్లి డివిజన్‌లో నిర్మాణంలో ఉన్న శ్మశానవాటిక పనులను వేగంగా పూర్తిచేయాలని ప్రత్యేకంగా మేయర్ , కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

## గెలాక్సీ డెంటల్ కేర్‌ను ప్రారంభించిన కార్పొరేటర్



ప్రజాస్ఫూర్తి , కాప్రా: కాప్రా సర్కిల్ పరిధిలోని డాక్టర్ ఏ ఎస్ రావు నగర్‌లో గెలాక్సీ డెంటల్ కేర్ దంత చికిత్స కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో అత్యంత విశ్వసనీయమైన దంత సేవల సంస్థగా గెలాక్సీ డెంటల్ కేర్ పేరుగాంచింది. నగరంలో ఇప్పటికే 6 శాఖలతో విస్తరించి ఉన్న ఈ సంస్థ, తాజాగా డాక్టర్ ఏ ఎస్ రావు నగర్‌లో తన నూతన శాఖను ప్రారంభించింది అన్నారు.మా వద్ద 30 మందికి పైగా అనుభవజ్ఞులైన వైద్యులు, ప్రత్యేకించి ఇంప్లాంట్లు, అలైనర్లు, కాస్మెటిక్ డెంటిస్ట్రీ నిపుణులు అందుబాటులో ఉంటారు. అంతర్జాతీయ ప్రమాణాల మేరకు స్టెరిలైజేషన్ పద్ధతులను పాటించడమే కాకుండా, పిల్లల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత సంరక్షణ అందించడమే మా లక్ష్యం అని వివరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోమశేఖర్ రెడ్డి, కాసం మహిపాల్ రెడ్డి, పెద్దాపురం కుమారస్వామి, బేతళ బల్ రాజు, రాజిరెడ్డి, అతిథి రాజు, ఎస్.ఎ. రహీం, నాను, చిన్నారావు, గోలి శ్రీనివాస్, సత్యనారాయణ, సుధాకర్,వైద్యులు డాక్టర్ సుధాకర్ రావు, డాక్టర్ సుప్రజ, డాక్టర్ వీణ తదితరులు పాల్గొన్నారు.

## శివన్న భరోసా – ప్రతి కష్టానికి తోడు, ప్రతి కుటుంబానికి అండ





ప్రజాస్ఫూర్తి , కాప్రా : కాప్రా డివిజన్‌లో నివాసముండే కైసర్ అనా రోగ్యంతో బాధపడుతూ గాంధీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వెంటనే, గోగికార్ శివకుమార్ నాయకత్వంలోని శివన్న భరోసా సేవా బృందం స్పందించారు. బాధిత కుటుంబాన్ని వ్యక్తిగతంగా పరామర్శించి, తక్షణమే ఆరువేల ఆర్థిక సహాయం అందజేశారు.ప్రతి కుటుంబానికి అండగా ఉండాలి అనే లక్ష్యంతో స్థాపించబడిన శివన్న భరోసా, వైద్య సహాయం ద్వారా మాత్రమే కాదు మానవీయ విలువలపై దృష్టి సారిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇది కేవలం సహాయం మాత్రమే కాదు, మానవత్వాన్ని నిలబెట్టే చర్యగా అభివర్ణించవచ్చు.ఈ కార్యక్రమంలో మణికంఠ, నర్సింగ్, గంగారెడ్డి పాల్గొన్నారు. సమాజంలో ఎవరు కష్టంలో ఉన్నా, మనం వారిని ఆదుకోవడం మన బాధ్యత. శివన్న భరోసా దాన్ని కార్యరూపంలో నిలిపే ప్రయత్నమే, అని సేవా బృంద సభ్యులు తెలిపారు.

## కాలనీ సమస్యలపై మాజీ మేయర్ తోటకూర అజయ్ కు వినతి పత్రం

*** అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరిస్తా**



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ దేవేందర్ నగర్ కాలనీ ఫేస్ టు లో సమస్యలపై డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జెన్న రాజు ఆధ్వర్యంలో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ కు దేవేందర్ నగర్ కాలనీ పేస్ టు వాసులు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్నా నా దృష్టికి తీసుకు వస్తే అధికారులతో మాట్లాడి మీ సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని, అన్నారు. ఈ కార్యక్రమంలో దేవేందర్ నగర్ కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్ , బైరుగొండ భూపాల్, బైరు మధు, బడిక సోములు, కర్రె బీరప్ప, సాయి, నాగరాజు, మాచర్ల రాజు, రాములు, హరిబాబు, సైదులు, రాజేష్, అనిల్,సోమయ్య, ఐలయ్య జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు

# మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

శేరిలింగం పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని సాయి చరణ్ కాలనీలో కల్తీ కల్లు తాగి మరణించిన వారి ఇంటి వద్దకు పీఏసీ చైర్మన్ , శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ గారు మాట్లాడుతూ కల్తీ కల్లు తాగి మరణించడం చాలా బాధాకరమైన విషయం అని, బాధాతప్త హృదయం తో తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నాను అని PAC చైర్మన్ గాంధీ గారు తెలియచేసారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుంది అని, రాజకీయ నాయకులు ఎవరైనా బాధిత కుటుంబాలకు అండగా నిలవాలి తప్ప రాజకీయాలు చేయొద్దు అని,వారికి బాసటగా నిలవాలని చేయుతనదించాలని ,కల్తీ కల్లు ఘటనలో రాందేవ్ రావ్ ఆసుపత్రిలో చేరిన వారందరినీ మెరుగైన వైద్యం కోసం నిమ్స్ , గాంధీ ఆసుపత్రులకు తరలించామన్నారు. అధికారులతో మాట్లాడి ఎప్పటికప్పుడు బాధితుల ఆరోగ్య పరిస్థితి వివరాలను సేకరిస్తున్నాము అని, కల్తీ కల్లు తాగి మృతి చెందిన కుటుంబాలకు కారణమైన అటువంటి కల్లు దుకాణలను సీజ్ చేయించాము అని, ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది అని, మళ్లీ కాలనీల మధ్య కల్లు దుకాణాలు ఓపెన్ చేస్తే వాళ్లతో రాళ్లతో కొట్టి చంపిన తప్పులేదు అని, పేద ప్రజల జీవితాలతో ఆడుకునేవారిని ఎంతటి వారైనా ఉపేక్షించే



ప్రసక్తే లేదన్నారు. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతూ కల్తీ వ్యాపారాలు చేసే ఎవరికైనా కఠిన చర్యలు తీసుకోవాలి అని,ఎక్సైజ్ అధికారులు, ఆరోగ్యశాఖ మంత్రి, ప్రభుత్వాధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ బాధితులకు మెరుగైన వైద్యం అందే విధంగా కృషి చేస్తున్నాం అని, బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించి బాధితులకు అండగా నిలిచే విధంగా కృషి చేస్తానన్నారు. కల్తీ కల్లు ఘటన జరగడం చాలా బాధాకరం అని , ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే వారు ఎంతటి వారైన కఠిన చర్యలు తీసుకుంటామని, ఘటన పై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్యం ప్రభుత్వం తరపున అందిస్తామని, అన్ని విధాలుగా అండగా ఉంటానాని, ఎవరు అధైర్య పడకూడదన్నారు. ఇలాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు అలసత్వం వీడి ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని,పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియచేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్ల రామ కృష్ణ గౌడ్, పోతుల రాజేందర్, కాశినాథ్ యాదవ్, జోగిపేట్ భాస్కర్, బోయ కిషన్, వెంకట్ నాయక్, లింగం, దర్శన్, సత్యనారాయణ, పద్మారావు,లక్ష్మి, శివ మరియు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ భూములు కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలి

* **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి**



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి మేడిపల్లి ఎంఆర్ఓ హసీనను ఆదేశించారు. శుక్రవారం మేడిపల్లి మండలంలోని బోడుప్పల్ గ్రామంలోని సర్వే నంబరు 63 లో గల ప్రభుత్వ భూమిని, అసైన్డ్ ల్యాండ్ ను కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డితో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి పరిశీలించారు. అదే విధంగా అదే సర్వే నంబరులో గల అసైన్డ్ ల్యాండ్ ను కూడా అదనపు కలెక్టరు తనిఖీ చేసారు.

## కల్తీ కల్లు తాగి మహిళ మృతి



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆల్విన్ కాలనీ డివిజన్ శంషిగుడా పరిధిలోని సాయి చరణ్ కాలనీ లో నివసించే చాకలి నరసమ్మ (52) కల్తీ కల్లు తాగి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ వారి తనయుడు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. డివిజి ట్రస్ట్ ద్వారా రూ.10,000ల ఆర్థిక సహాయం అందించి, కుటుంబ సభ్యులకు ధైర్యం నింపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ కష్టం వచ్చిన నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా అంతిమయాత్రలో పాల్గొని నివాళులు అర్పించారు. ఈ కార్య క్రమంలో భాస్కర్, వెంకట్ నాయక్, లక్ష్మమ్మ, లింగం, సుధాకర్, శివ, బాబు, దర్శన్, సత్తయ్య, వీరప్ప, వెంకటయ్య కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.




## వైభవంగా ఇతర రంగాలలో రాణిస్తున్న ప్రముఖులకు అవార్డుల ప్రధానోత్సవం

చిక్కడ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : జూలై 11వ తేదీ చిక్కడపల్లి త్యాగరాయగాన సభ ఆడిటోరియంలో మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా రంగంలోనూ, ఇతర రంగాలలో రాణిస్తున్న ప్రముఖులకు అవార్డుల ప్రధానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా కూల్ ఎవరెస్ట్ ఐస్ క్రీమ్ అధినేత యక్కంటి వెంకటరెడ్డిని భారత సేవా రత్న నేషనల్ అవార్డుతో సత్కరించడం జరిగింది. వ్యాపార రంగంలో అంచలంచెలుగా ఎదుగుతూ, మానవతా దృక్పథంతో వందలాది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సేవలను గుర్తించి వాటికి గుర్తుగా ఈ అవార్డుతో వెంకటరెడ్డిని సత్కరిస్తున్నట్లు మనం ఫౌండేషన్ ఫౌండర్ చక్రవర్తి తెలియజేశారు. ఈ అవార్డుతో తన బాధ్యత ఇంకా పెరిగిందని ఈ గుర్తింపుతో మరింత ముమ్మరంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, తన సేవలు గుర్తించి అవార్డు ఇచ్చినందుకు మనం ఫౌండేషన్ సంస్థ సభ్యులకు యక్కంటి వెంకటరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సినీ నటులు రాజేంద్ర, నిర్మాత బిక్షపతి , ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## వ్యాపారాలకేమో హిందీ కావాలి... మరి హిందీ నేర్చుకోవడానికి ఇబ్బంది ఏంటి?: పవన్



ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందీ భాష యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. ఐటీ రంగంలో విజయం సాధించడానికి ఆంగ్లం ఎంత ముఖ్యమో, దేశంలో ఎక్కువ మంది మాట్లాడే హిందీని నేర్చుకోవడం వల్ల కూడా అంతే ప్రయోజనం ఉంటుందని ఆయన అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో ఏర్పాటు చేసిన రాజ్య భాషా విభాగ స్వర్ణోత్సవ వేడుకల్లో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, దక్షిణ భారతీయ సినిమాలలో 31 శాతం హిందీ డబ్బింగ్ ద్వారానే ఆదాయం వస్తుందని గుర్తు చేశారు. వ్యాపారానికి హిందీ అవసరమైనప్పుడు, నేర్చుకోవడానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. తన సినిమాలో "ఏ మేరా జహా" అనే హిందీ పాట పెట్టడానికి గల కారణాన్ని వివరిస్తూ, మాతృభాష తెలుగు అయినప్పటికీ, హిందీ దేశ భాష అని చెప్పడానికే అలా చేశానని తెలిపారు. హిందీ నేర్చుకోవడం అంటే మన ఉనికిని కోల్పోవడం కాదని, మరింత బలపడటమని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మరో భాషను అంగీకరించడం ఓటమి కాదని, కలిసి ప్రయాణించడమని ఆయన ఉద్ఘాటించారు. విద్య, వైద్యం, వ్యాపారం, ఉపాధి వంటి రంగాలలో భాషా అవధులు చెరిగిపోతున్న ఈ సమయంలో హిందీని వ్యతిరేకించడం రాబోయే తరాల అభివృద్ధిని అడ్డుకోవడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం వంటి మాతృభాషల పట్ల గౌరవం ఉండాలని చెబుతూనే, హిందీని పెద్దమ్మ భాషగా అభివర్ణించారు. ఇంట్లో మాట్లాడుకోవడానికి మాతృభాష ఉండగా, దేశ సరిహద్దులు దాటితే హిందీ రాజ్య భాషగా ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచం విడిపోవడానికి కారణాలు వెతుకుతుంటే, భారతదేశం మాత్రం ఒకే భాషతో ఏకం కావాలని చూస్తోందని, అది హిందీతో సాధ్యమవుతుందని ఆయన అన్నారు.ఒక బెంగాలీ గీతం జాతీయ గీతమైందని, ఒక పంజాబీ దేశం కోసం పోరాడారని, రాజస్థాన్‌కు చెందిన రాణప్రతాప్ శౌర్యానికి చిహ్నంగా నిలిచారని, తమిళనాడుకు చెందిన అబ్దుల్ కలాం మిస్సైల్ మ్యాన్ అయ్యారని, మద్రాస్ ప్రెసిడెన్సీకి చెందిన వ్యక్తి రూపొందించిన మువ్వన్నెల జెండా దేశానికి తిరంగా అయిందని ఆయన గుర్తు చేశారు. ప్రతి భాషా జీవ భాష, మాతృ భాష అయినప్పటికీ, రాజ్య భాష మాత్రం హిందీయేనని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## అక్రమ నిర్మాణాలు కూల్చివేత



బోడుప్పల్, (ప్రజాస్ఫూర్తి ) : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబర్ 63/26 నుండి సర్వేనెంబర్ 63/39 గౌతమ్ నగర్ లో గల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని మేడిపల్లి తాసిల్దార్ హసీనా ఆదేశాల మేరకు మేడిపల్లి రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేశారు.ఈ సందర్భంగా మేడిపల్లి తాసిల్దార్ హసీనా మాట్లాడుతూ ప్రభుత్వ భూములలో కబ్జా లకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

## యోగ గురువు భీమయ్య కు శుభాకాంక్షలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : గురుపౌర్ణమి సందర్భంగా శుక్రవారం యోగ గురువు భీమయ్య ని కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జె.కె.శేఖర్ యాదవ్ ఆయనను శాలువాతో సత్కరించి వారితో కేక్ కట్ చేయించి కేక్ తినిపించారు. ఈ కార్యక్రమంలో జగన్, సుధాకర్, రవి, వెంకట్ రెడ్డి, రాములు ,శ్రీనివాస్ ,చందు సోను తదితరులు పాల్గొన్నారు.

## వెంటిలేటర్‌పై ఉన్న ఆర్థిక వ్యవస్థను ఐసీయూలోకి తీసుకొచ్చాం: మంత్రి నిమ్మల

పాలకొల్లు: వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఐసీయూలోకి తీసుకొచ్చామని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వ్యవసాయశాఖను నిర్వీర్యం చేశారని విమర్శించారు. కష్టపడి పండించిన పంట విలువ జగన్‌కు ఏం తెలుసు?అని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా సూపర్ సిక్స్ హామీలు నెరవేరుస్తున్నామన్నారు.

## ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ట్విస్ట్... విచారణకు హాజరైన రజత్ భార్గవ

* **సిట్ విచారణకు హాజరైన మాజీ ఐఏఎస్ రజత్ భార్గవ**
* **విచారణకు హాజరుకాలేనని ఉదయం సమాచారం పంపిన వైనం**
* **తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేసిన సిట్ అధికారులు**

ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఈరోజు కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసును విచారిస్తున్న సిట్ అధికారుల నుంచి నోటీసులు అందుకున్న నాటి ఎక్సైజ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి, మాజీ ఐఏఎస్ రజత్ భార్గవ విచారణకు హాజరయ్యారు. తనతో పాటు తన హెల్త్ కండిషన్ కు సంబంధించిన మెడికల్ సర్టిఫికెట్లను వెంట తెచ్చుకున్నారు. మరోవైపు, ఈనాటి సిట్ విచారణకు హాజరుకాలేనని ఉదయం ఆయన విచారణాధికారులకు సమాచారం పంపించారు. తన ఆరోగ్యం బాగోలేదని తెలిపారు. అయినప్పటికీ విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని సిట్ స్పష్టం చేయడంతో ఆయన విచారణకు హాజరయ్యారు. ఇప్పటికే సిట్ అధికారులు ఈ కేసులో పలువురిని విచారించి, అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

## రాజధాని లేదు.. పిచ్చి మొక్కలే ఉన్నాయి : వైఎస్ షర్మిల

ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రాజధాని అమరావతిపై పలు సంచలన ఆరోపణలు చేశారు. నేడు అమరావతి రాజధాని ప్రాంతంలోని ఉద్దండరాయునిపాలెంలో వైఎస్ షర్మిల పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్రంలో రాజధాని నిర్మాణం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై తీవ్ర విమర్శలు చేశారు. 2015లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన ఉద్దండరాయునిపాలెం ప్రాంతం పూర్తిగా నిర్లక్ష్యానికి గురై, మట్టికొట్టుకుపోయిందని షర్మిల ఆరోపించారు. 54 వేల ఎకరాల్లో సింగపూర్, జపాన్, ఇస్తాంబుల్‌లాంటి ఆధునిక రాజధానిని నిర్మిస్తామని చెప్పినప్పటికీ, ఈ ప్రాంతంలో అభివృద్ధి లేదని, మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని, కేవలం పిచ్చి మొక్కలు మాత్రమే ఉన్నాయని విమర్శించారు. రాజధాని నిర్మాణం కోసం చంద్రబాబు మరో 40 వేల ఎకరాల భూమిని అడుగుతున్నారని, ఇది రాజధాని నిర్మాణానికి కాకుండా రియల్ ఎస్టేట్ మాఫియా నడపాలనే ఉద్దేశం ఉన్నట్లు కనిపిస్తోందని మండిపడ్డారు. "ఆలీ లేదు,



చూలు లేదు, కొడుకు పేరు సోమలింగం" అన్నట్టు.. రాజధాని నిర్మాణంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని ఎద్దేవా చేశారు.

## ఆ ప్రకటన పచ్చి మోసం: ప్రభుత్వంపై పేర్ని నాని సెన్సేషనల్ కామెంట్స్

తోతాపురి మామిడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ. 4 మద్దతు ధర ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ డబ్బులు ఇప్పటి వరకూ పడలేదని వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని ఎద్దేవా చేశారు. రైతుల కన్నీళ్లు ప్రభుత్వానికి కనిపించడంలేదని విమర్శించారు. జగన్ వెళ్లే వరకు మామిడి రైతులను పట్టించుకోలేదన్నారు. జగన్ వెళ్లడం వల్లే కిలో మామిడి రూ.6కి కొంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 4 రూపాయలు కాదు 4 పైసలు వేయలేదని చెప్పారు. రూ.4 సబ్సిడీ ప్రకటన పచ్చి మోసమని వైసీపీ నేత పేర్ని నాని విమర్శించారు. కాగా చిత్తూరు జిల్లాలో తోతాపురి రైతులు తీవ్ర



నష్టాలతో అల్లాడిపోతున్నారు. పండిన పంటకు గిట్టుబాటు ధర రాక ఏం చేయాలో తోచక ఆయోమయ స్థితిలో పడ్డారు. దీంతో ఈ విషయం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. మామిడి రైతులను ఆదుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహకంగా మామిడికి రూ. 4 ప్రభుత్వం అందిస్తుందని ప్రకటించారు. అయితే మామాడి రైతులను మాజీ సీఎం జగన్ పరామర్శించేందుకు జగన్ బంగారుపాళ్యం వెళ్లారు. కానీ అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనుమతులు లేకుండా భారీగా జనాన్ని సమీకరించారు. దీంతో భద్రత కోసం పోలీసులు శ్రమించాల్సి వచ్చింది.ఈ సమయంలో వైసీపీకి చెందిన కొందరికి, పోలీసులకు గాయాలయ్యాయి. దీంతో కూటమి నేతలు, వైసీపీ నాయకుల మధ్య మాటల యుద్ధం మరింత పెరిగింది. పరస్పరం విమర్శలు చేసుకున్నారు. తాజాగా మాజీ మంత్రి పేర్ని నాని సైతం స్పందించారు. ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీపై విమర్శలు కురిపించారు.

## కానిస్టేబుల్ అభ్యర్థులకు అలర్ట్.. తుది రాత పరీక్ష ఫలితాలు విడుదల...

కానిస్టేబుల్ తుది రాతపరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం(AP Government) చేపట్టిన పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ 2025 ఫైనల్ తుది ఫలితాలను పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తాజాగా విడుదల చేసింది. ఈ ఫలితాల కోసం అధికారిక వెబ్‌సైట్ http://slprb.ap.gov.in/ ను సందర్శించండి. దీనికి సంబంధించిన ఫైనల్ రాత పరీక్షను గత నెల(జూన్) 1వ తేదీన నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ తుది పరీక్షకు దాదాపు 37,600 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ క్రమంలో హాజరైన అభ్యర్థుల్లో 33,921 అర్హత సాధించారు. అయితే.. వివిధ సామాజిక వర్గాలు, ఇతర రిజర్వేషన్లు పరిగణలోకి తీసుకొని ఫైనల్‌గా సలెక్ట్ అయిన వారి వివరాలను, OMR షీట్లు అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. నేటి నుంచి 17వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు.

# కర్ణాటక తరహాలో తెలంగాణలో పవర్ షేరింగ్ ఉందా? భట్టి విక్రమార్క ఏం చెప్పారంటే...

* కర్ణాటక తరహాలో పవర్ షేరింగ్ లేదన్న మల్లు భట్టి విక్రమార్క
* బీఆర్ఎస్ నాయకుల మాటలు మితిమీరుతున్నాయని విమర్శ
* కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని మండిపాటు

కర్ణాటక తరహాలో తెలంగాణలో పవర్ షేరింగ్ లేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వంలో అందరం టీమ్ వర్క్‌తో పని చేస్తున్నామని ఆయన అన్నారు. ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, ఇటీవల జరిగిన రాష్ట్ర కాంగ్రెస్ పీఏసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ ప్రభుత్వ పనితీరుపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు.



బీఆర్ఎస్ నాయకుల మాటలు మితిమీరుతున్నాయని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, ప్రజల్లోకి వెళ్లడం లేదని విమర్శించారు. రూ. 2 లక్షలు దాటిన వారికి రుణమాఫీ చేయొద్దన్నది తమ ప్రభుత్వం నిర్ణయమని ఆయన స్పష్టం చేశారు. రేషన్ కార్డు ఆధారంగానే రుణమాఫీ చేసినట్లు చెప్పారు. సన్న బియ్యం విజయవంతమైందని, గతంలో వలె పక్కదారి పట్టడం లేదని ఆయన అన్నారు. ఉచిత బస్సులకు మహిళల నుంచి మంచి స్పందన వస్తోందని ఆయన పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ పనులు జరుగుతున్నాయని తెలిపారు. మూసీ సుందరీకరణ పనులు ఈ ప్రభుత్వ హయాంలోనే పూర్తవుతాయని హామీ ఇచ్చారు. గాంధీ ఘాట్ వరకు సుందరీకరణ పనులు జరిగితీరుతాయని అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు కూడా వస్తోందని తెలిపారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చే అవకాశమే లేదని ఆయన వ్యాఖ్యానించారు.



# బండి సంజయ్‌కు రాజాసింగ్ పుట్టిన రోజు శుభాకాంక్షలు

* ఈరోజు బండి సంజయ్ 54వ పుట్టిన రోజు
* శుభాకాంక్షలు తెలియజేసిన పలువురు నాయకులు, అభిమానులు
* బండి సంజయ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన అమిత్ షా

కేంద్ర సహాయ మంత్రి, కరీంనగర్ బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ రోజు బండి సంజయ్ 54వ పుట్టినరోజు కావడంతో ఆయనకు పలువురు నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. "కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్న గారికి హార్ధిక జన్మదిన శుభాకాంక్షలు" అంటూ రాజాసింగ్ ట్వీట్ చేశారు. కేంద్ర మంత్రి అమిత్ షా కూడా బండి సంజయ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, భగవంతుడు మీకు దీర్ఘాయుష్షు, ఆరోగ్యం, ఆనందాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఇదే నిబద్ధతతో, ఉత్సాహంతో దేశానికి సేవను కొనసాగిస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. అమిత్ షా 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలియజేయగా, బండి సంజయ్ ధన్యవాదాలు తెలుపుతూ రీట్వీట్ చేశారు.

# బీసీ రిజర్వేషన్లపై మంత్రి చెప్పారు కానీ, కొన్ని అనుమానాలు ఉన్నాయి: కవిత

* ఆర్డినెన్స్ తీసుకు వస్తామని చెప్పినందున రైల్ రోకోను వాయిదా వేస్తున్నట్లు కవిత వెల్లడి
* ఆర్డినెన్స్ తేవాలనుకుంటే 18 నెలలు ఎందుకు ఆగారని ప్రభుత్వానికి నిలదీత
* వారం రోజుల పాటు ప్రభుత్వం కార్యాచరణను గమనిస్తామన్న కవిత

స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పడం సంతోషకరమని, అయితే తమకు కొన్ని అనుమానాలు ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని తాము స్వాగతిస్తున్నామని, అందుకే ఈ నెల 17న తలపెట్టిన రైల్ రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఆమె



తెలిపారు. ఆర్డినెన్స్ జారీ చేసిన వెంటనే రిజర్వేషన్లను అమలు చేయగలిగితే కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలు ఎందుకు వేచి చూసిందని కవిత ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసమే అలా చేశారని తాము భావిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు చేస్తోందని ఆమె విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, దీంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాజ్యాంగ సవరణ జరిగితే బీసీలకు రాజకీయంగా హక్కులు లభిస్తాయని కవిత అన్నారు. విద్య, ఉద్యోగాల గురించి కూడా ప్రభుత్వం స్పష్టతనివ్వాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని, కాబట్టి తలుచుకుంటే ఒక్క నిమిషంలో రాజ్యాంగ సవరణ చేసి ఇవ్వవచ్చని అన్నారు. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. తప్పులన్నీ కాంగ్రెస్ పైకి నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారేమోనని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఆమె అన్నారు. బీసీ బిల్లును షెడ్యూల్ 9లో పెట్టాలని, దీని కోసం బీసీ బిడ్డ, కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలని కవిత విజ్ఞప్తి చేశారు. ఆర్డినెన్స్ తీసుకువస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినందున, ఈ వారం రోజులు ప్రభుత్వ కార్యాచరణను గమనించి, అందుకు అనుగుణంగా తాము నిర్ణయం తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.

# రేణుకా చౌదరిపై నమోదైన కేసును కొట్టివేసిన ఎస్సీ, ఎస్టీ కోర్టు

* ఖమ్మం కోర్టులో రేణుకా చౌదరికి ఊరట
* ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానంటూ రేణుక మోసం చేశారంటూ కళావతి ఫిర్యాదు
* ఆరోపణలు రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేసిన జడ్జి




కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరికి ఖమ్మం కోర్టులో ఊరట లభించింది. ఆమెపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును కోర్టు కొట్టివేసింది. కేసు వివరాల్లోకి వెళితే... 2014లో తనకు, లేదా తన భర్తకు వైరా ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని చెప్పి రేణుకా చౌదరి మోసం చేశారంటూ భూక్య రాంజీ భార్య కళావతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టును కూడా ఆశ్రయించారు. దీనికి సంబంధించి ఖమ్మం జిల్లా కోర్టులోని ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానంలో విచారణ కొనసాగింది. అయితే రేణుకపై ఆరోపణలు రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేస్తూ జడ్జి తీర్పును వెలువరించారు. రేణుక తరపున సీనియర్ న్యాయవాదులు నిరంజన్ రెడ్డి, మద్ది శ్రీనివాస్ రెడ్డి వాదనలు వినిపించారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో కవితకు ఏం సంబంధం? : మహేశ్ కుమార్ గౌడ్

* రిజర్వేషన్ల క్రెడిట్ బీఆర్ఎస్ తీసుకోవడం ఏమిటని ప్రశ్నించిన టీపీసీసీ చీఫ్
* కవితను చూసి జనాలు నవ్వుకుంటున్నారని వ్యాఖ్య
* కేసీఆర్ పదేళ్లు ఏం వెలగబెట్టారని నిలదీత

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే, ఆ ఘనతను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీసుకోవడం ఏమిటని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ఆయన అన్నారు. ఈ నిర్ణయం వెనుక ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆశయం ఉందని ఆయన పేర్కొన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మరోసారి నిరూపితమైందని అన్నారు. బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఎనలేని కృషి చేస్తోందని వివరించారు. బీసీ రిజర్వేషన్లకు బీఆర్ఎస్ పార్టీకి, కవితకు ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు. తాము చేసిన పనికి ఆమె క్రెడిట్ తీసుకోవడం ఏమిటని నిలదీశారు. కవితను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ పదేళ్లు ఏం చేశారో చెప్పకుండా ఆమె బీసీ పాట పాడుతున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లు రాహుల్ గాంధీ అజెండా, రేవంత్ రెడ్డి నిబద్ధత అని ఆయన స్పష్టం చేశారు.



# కల్తీ కల్లు ఘటన.. బాలానగర్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వోపై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్: కూకట్‌పల్లి పరిధిలో జరిగిన కల్తీ కల్లు వ్యవహారంలో ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకుంది. బాలానగర్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో వేణుకుమార్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. డీటీఎఫ్ నర్సిరెడ్డి, ఏఈఎస్ మాధవయ్య, ఈఎస్ ఫయాజ్, ఏఈఎస్ జీవన్‌కిరణ్ పాత్రపై దర్యాప్తు కొనసాగిస్తోంది. కల్తీ కల్లు ఘటనలో ఇప్పటివరకు ఐదుగురు మృతి చెందారు. మొత్తం 37 మంది అస్వస్థతకు గురయ్యారు. నిమ్స్ ఆసుపత్రిలో 31 మందికి చికిత్స అందిస్తున్నారు. వీరిలో 27 మంది ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కూకట్‌పల్లిలోని పలు కల్లు దుకాణాల నుంచి అధికారులు నమూనాలను




సేకరించారు. ఈ క్రమంలో వాటిని ల్యాబ్‌లో పరీక్షించగా.. కాంపౌండ్‌లలో సేకరించిన కల్లులో కెమికల్స్ ఉన్నట్లు గుర్తించారు. రసాయనాలు కలిపిన కల్లు వల్లే అస్వస్థతకు గురైనట్లు ఎక్సైజ్ అధికారులు నిర్ధరించారు.

# ప్రతి మండలానికి 46 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు : మంత్రి పొంగులేటి

హైదరాబాద్: తెలంగాణలోని ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 27న శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు తుది పరీక్ష నిర్వహిస్తామని.. ఆ తర్వాత 28, 29 తేదీల్లో జేఎన్టీయూ ఆధ్వర్యంలో ల్యాబ్



ప్రాక్టికల్స్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 12న ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు సర్వేయర్లతోపాటు ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక జీపీవోను నియమించనున్నట్లు తెలిపారు. నక్షా లేని 413 గ్రామాలు రాష్ట్రంలోఉన్నాయన్నారు. నక్షా కోసం 5 గ్రామాల్లో ప్రయోగాత్మకంగా రీసర్వే చేశామని, వీటి ఫలితాలను పరిగణనలోకి తీసుకుని మిగిలిన గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తామని మంత్రి తెలిపారు.

# తెలంగాణలో మహిళా సంఘాలకు రూ.344 కోట్లు విడుదల

హైదరాబాద్: తెలంగాణలో మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు సెర్ప్‌కు ఆర్థిక శాఖ రూ.344 కోట్లు విడుదల చేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి. జులై 12 నుంచి 18 వరకు మహిళా సంఘాల ఖాతాల్లో వడ్డీలేని డబ్బులు జమ కానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలకు రూ.300 కోట్లు, పట్టణ మహిళా సంఘాలకు రూ.44 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది.



# భారీ భవనాల నిర్మాణంలో పర్యావరణానికి పెద్దపీట వేయాలి : మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొం టున్న వాతావరణ మార్పులు, పట్టణీకరణ, కాలుష్యం, కర్బన ఉద్గారాల పెరుగుదల వంటి ఎన్నో సమస్యలకు పర్యావరణహిత నిర్మాణాలు పరిష్కారం చూపుతాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆ దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని, ఈ ప్రయాణంలో భాగస్వాములు కావాలని సివిల్ ఇంజినీర్లను కోరారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్, హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో "నెక్స్ట్ జెన్ హైరైజ్ బిల్డింగ్స్" అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సును మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80,000 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చిందని చెప్పారు. ఈ గణాంకాలు తెలంగాణ నిర్మాణ రంగ ప్రగతికి నిదర్శనమన్నారు. హైదరాబాద్‌లో 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న భవనాల సంఖ్య 200పైగానే ఉన్నాయని, మరో 250 భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ తరహా భారీ భవనాల నిర్మాణంలో పర్యావరణానికి పెద్దపీట వేయాలని సూచించారు. కాంపోజిట్ స్టీల్ హైరైజ్ డిజైన్‌పై జాతీయస్థాయిలో ఒకే రకమైన మార్గదర్శకాలు తెచ్చేలా కేంద్రం, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌తో కలిసి పని చేస్తామన్నారు. సంప్రదాయబద్ధంగా



కాకుండా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వినూత్నంగా ఆలోచించాలని, కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని యువ సివిల్ ఇంజనీర్లకు హామీ ఇచ్చారు.

## ఐటీ షేర్ల ఎఫెక్ట్.. భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

### మెప్పించలేకపోయిన టీసీఎస్ క్యూ1 ఫలితాలు

### 689 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

### 205 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాల్లో ముగిశాయి. ఐటీ షేర్లలో అమ్మకాలు సూచీలను కిందకు పడేశాయి. టీసీఎస్ త్రైమాసిక ఫలితాలు మెప్పించకపోవడంతో ఐటీ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ ఒకానొక దశలో 700 పాయింట్ల మేర నష్టపోయింది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 689 పాయింట్ల నష్టంతో 82,500కి దిగజారింది. నిఫ్టీ 205 పాయింట్లు కోల్పోయి 25,149 వద్ద స్థిరపడింది.

బీఎస్ఈ సెన్సెక్స్ లో టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతి ఎయిర్ టెల్, టాటా మోటార్స్, టైటాన్ టాప్ లూజర్లుగా ఉన్నాయి. హిందుస్థాన్ యూనిలీవర్, యాక్సిస్ బ్యాంక్, సన్ ఫార్మా, ఎన్టీపీసీ, ఎటర్నల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. డాలరుతో రూపాయి మారకం విలువ రూ. 85.80గా ఉంది.

## హెచ్‌యూఎల్‌కు తొలిసారి మహిళా నాయకత్వం..

### ఇంతకీ ఎవరీ ప్రియా నాయర్..?



**న్యూఢిల్లీ:** హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్‌కు తొలిసారి మహిళ నాయకత్వం వహించబోతున్నారు. ప్రస్తుతం కంపెనీ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రియా నాయర్.. చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి, మేనేజింగ్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. ఈ నియామకం ఆగస్టు 1 నుంచి అమల్లోకి రానున్నది.

ప్రస్తుతం సీఈఓగా ఉన్న రోహిత్ జావా వ్యక్తిగత కారణాల రీత్యా జులై 31తో తన బాధ్యతల నుంచి తప్పుకొంటున్నారు. ఆపై ప్రియా నాయర్ సంస్థను ముందుండి నడిపించనున్నారు. ఆమె ఈ పదవిలో ఐదేళ్ల పాటు కొనసాగుతారు. ఒక మహిళను ఎండీ, సీఈఓ పదవిలో నియమించడం హెచ్‌యూఎల్ చరిత్రలో ఇదే మొదటిసారి. ఈ నేపథ్యంలో ప్రియా నాయర్ ఎవరన్న ఉత్సుకత మొదలైంది. ఇంతకీ ప్రియా నాయర్ ఎవరు.. ఆమె బ్యాక్‌గ్రౌండ్ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

### ఎవరీ ప్రియా నాయర్..?

మహారాష్ట్ర కొల్హాపూర్‌లో మలయాళీ కుటుంబంలో ప్రియా నాయర్ జన్మించారు. ఆమె చదువంతా ముంబైలోనే సాగింది. ముంబైలోని సిడెన్‌హామ్ కళాశాల నుండి అకౌంట్స్ అండ్ స్టాటిస్టిక్స్‌లో బీకామ్ పట్టా పొందారు. ఆ తర్వాత పూణెలోని సింబియోసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ నుంచి మార్కెటింగ్‌లో ఎంబీఏ పూర్తి చేశారు. తర్వాత హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ పూర్తి చేశారు.

దాదాపు 30 ఏళ్లుగా హిందుస్థాన్ యూనిలీవర్‌కు ప్రియా నాయర్ సేవలందిస్తున్నారు. 1995లో హెచ్‌యూఎల్‌లో చేరారు. సేల్స్ అండ్ మార్కెటింగ్ విభాగాల్లో విధులు నిర్వహించారు. హోమ్ కేర్, బ్యూటీ, పర్సనల్ కేర్ వంటి విభాగాల్లో నాయకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె సారథ్యంలో హోమ్‌కేర్ విభాగం 2014 -2020లో భారీ వృద్ధిని నమోదు చేసుకున్నది. సంస్థ కీలక ఉత్పత్తులైన డౌవ్, రిన్, కంఫర్ట్ వంటి ఉత్పత్తులకు 1998లో బ్రాండ్ మేనేజర్‌గా నియమితులయ్యారు.

లాండ్రీ బిజినెస్‌కు నాయకత్వం వహించారు. ఓరల్ కేర్, డియోడరెంట్స్, కస్టమర్ డెవలప్‌మెంట్ విభాగాలను కూడా నిర్వహించారు. 2020 నుంచి 2022 వరకు బ్యూటీ అండ్ పర్సనల్ కేర్ విభాగానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. తర్వాత యూనిలీవర్‌లో బ్యూటీ, వెల్‌బీయింగ్ విభాగానికి గ్లోబల్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్‌గా, 2023 నుంచి ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## జులై 15న భారత్‌లో టెస్లా తొలి షోరూం ప్రారంభం..!



**న్యూఢిల్లీ:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూం ప్రారంభించనున్నట్లు తెలిసింది. మరో నాలుగు రోజుల్లో అంటే జులై 15న టెస్లా భారత్‌లో తొలి షోరూంను అఫీషియల్‌గా లాంఛ్ చేయనున్నట్లు ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ నివేదించింది. ముంబై జియో వరల్డ్‌లో ఈ షోరూం ప్రారంభించనున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఇప్పటికే టెస్లా సంస్థ వై మోడల్ కార్లను చైనాలోని షాంఘై నగరంలో గల తమ ఫ్యాక్టరీ నుంచి తీసుకొచ్చినట్లు సమాచారం. డిమాండ్‌ను బట్టి ఆ తర్వాత ఢిల్లీలోనూ షో రూం ఏర్పాటు చేయాలనే ప్రణాళికతో టెస్లా ఉందని సదరు నివేదికలు వెల్లడించాయి.

ఈ షోరూం కోసం ముంబై నడిబొడ్డున బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ అద్దెకు తీసుకున్నట్లు ఇటీవలే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగాను కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ నెలకు రూ.35 లక్షల అద్దె చెల్లించనున్నారని తెలిసింది. అద్దె ఏడాదికి 5 శాతం పెంపు ప్రాతిపదికన ఐదేళ్ల కాలానికి యూనివ్‌కో ప్రాపర్టీస్ నుంచి లీజుకి తీసుకుంది. ఈ ప్రాపర్టీ గ్రౌండ్ ఫ్లోర్ దేశీయంగా ఏర్పాటైన తొలి యాపిల్ స్టోర్‌కు దగ్గరగా ఉంటుంది. రెంటల్ అగ్రిమెంట్ ఫిబ్రవరి 27న రిజిస్టరైంది. రూ.2.11 కోట్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా కూడా టెస్లా జమ చేసినట్లు సమాచారం. ఎలన్ మస్క్ సారథ్యంలోని టెస్లా భారత మార్కెట్‌లోకి అడుగుపెట్టేందుకు ఎంతోకాలంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. భారత్ విధించే దిగుమతి సుంకాలు తమకు అడ్డంకిగా మారాయని టెస్లా గతంలోనే పేర్కొంది. అయితే, భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే అమెరికాలో పర్యటించిన విషయం తెలిసిందే. రెండు రోజుల పర్యటనలో భాగంగా టెస్లా బాస్ ఎలాన్ మస్క్‌తో భేటీ అయ్యారు. ఆ భేటీలో వాణిజ్య అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా టెస్లా భారత్‌లో ప్రవేశానికి సంబంధించిన కీలక అంశాలను కూడా ఇరువురూ ప్రస్తావించినట్లు సమాచారం. మోదీ అమెరికా పర్యటన సమయంలోనే భారత్‌లో టెస్లా విస్తరణకు బీజం పడింది. ఆటోమొబైల్ రంగంలో కొత్త ఒరవడి సృష్టించిన టెస్లా కంపెనీ ఎలక్ట్రిక్ కార్ల మార్కెట్‌కు ఈసారి భారత్‌ను ఎంచుకుంది. యూరప్, చైనాలో అమ్మకాలు పడిపోవడంతో ఇండియాలో సొమ్ము చేసుకోవాలనే ఆలోచనతో ఉంది ఎలాన్ మస్క్ సంస్థ. అందులో భాగంగానే ముంబైలో తమ తొలి షోరూంను ప్రారంభించేందుకు సిద్ధమైంది.

# అర్ధ శతకంతో రాణించిన రాహుల్..





**లార్డ్స్:** లార్డ్స్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత జట్టు భారీ స్కోర్ ఆశలన్నీ మిడిలార్డర్ మీదే ఆధారపడి ఉన్నాయి. జస్ప్రీత్ బుమ్రా (5-74) విజృంభణతో ఇంగ్లండ్‌ను రెండో సెషన్‌లోనే చుట్టేసిన టీమిండియాకు శుభారంభం లభించలేదు. ఓపెనర్ కేఎల్ రాహుల్(53 నాటౌట్) అర్ధ శతకంతో రాణించాడు. క్రీజులో పాతుకుపోయిన రాహుల్ కరుణ్ నాయర్ (40), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (16) తో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. నాలుగో వికెట్‌గా వచ్చిన వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ (19 నాటౌట్) తనదైన స్టయిల్లో ఆడి రాహుల్‌కు సహకరించాడు. అయితే.. 75 ఓవర్లకే మ్యాచ్‌ను నిలిపివేయడంతో స్టంప్స్ సమయానికి భారత్ 3 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 242 రన్స్ వెనకబడి ఉంది.

అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో రెండో విజయంపై కన్నేసిన భారత జట్టు లార్డ్స్ టెస్టులో పోరాడుతోంది. టాపార్డర్ విఫలం కావడంతో జట్టును గట్టెక్కించే బాధ్యత మిడిలార్డర్ తీసుకోవాల్సి ఉంది. భారత ఇన్నింగ్స్ మొదలైన కాసేపటికే జోఫ్రా ఆర్చర్ డేంజరస్ యశస్వీ జైస్వాల్(13)ని ఔట్ చేశాడు. యశస్వీ ఆడిన బంతి ఎడ్జ్ తీసుకోగా స్లిప్‌లో ఉన్న హ్యారీ బ్రూక్ ఒడుపుగా అందుకున్నాడు. ఆ తర్వాత కరుణ్ నాయర్(40), కేఎల్ రాహుల్(53 నాటౌట్)లు కీలక భాగస్వామ్యం నిర్మించి.. వికెట్ పడకుండా చూసుకున్నారు.

టీ బ్రేక్ తర్వాత స్టోక్స్ బౌలింగ్‌లో నాయర్ కట్ చేసిన బంతిని జో రూట్ డైవింగ్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. ఫస్ట్ స్లిప్‌లో కాచుకొని ఉన్న ఇంగ్లండ్ స్టార్ రెప్పపాటులో ఎడమవైపు డైవ్ చేస్తూ సింగిల్ హ్యాండ్‌తో బంతిని ఒడిసిపట్టుకున్నాడు. నాయర్ పెవిలియన్ చేరడంతో 74 పరుగుల వద్ద టీమిండియా రెండో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్(16) జతగా ఇన్నింగ్స్ నిర్మించాడు రాహుల్. అయితే.. ఈ ద్వయాన్ని విడదీసేందుకు క్రిస్ వోక్స్ పన్నిన వ్యూహంలో గిల్ చిక్కుకున్నాడు. అనంతరం రాహుల్‌కు సహకరిస్తూ రిషభ్ పంత్ జట్టు స్కోర్ 140 దాటించాడు. వీళ్లిద్దరూ మూడో రోజు తొలి సెషన్‌లో నిలబడితే టీమిండియా భారీ స్కోర్ చేయడం ఖాయం.

### బుమ్రా 5 వికెట్లతో..

బర్మింగ్‌హమ్‌లో భారత పేసర్ల విజృంభణతో చిత్తుగా ఓడిన ఇంగ్లండ్ లార్డ్స్‌లోనూ రెండో సెషన్‌లోనే ఆలౌటయ్యింది. జస్ప్రీత్ బుమ్రా (5-74) ఇంగ్లండ్ బ్యాటింగ్ యూనిట్‌ను కకావికలం చేశాడు. తొలి సెషన్‌లో మూడు వికెట్లతో ఆతిథ్య జట్టును దెబ్బతీసిన స్పీడ్‌స్టర్.. లంచ్ తర్వాత ఆర్చర్‌ను బౌల్డ్ చేసి ఐదో వికెట్ సాధించాడు. ఒకదశలో 271కే ఏడు వికెట్లు పడినా.. బ్రాండన్ కార్సే (56), వికెట్ కీపర్ జేమీ స్మిత్(51)ల అసమాన పోరాటంతో స్టోక్స్ సేన కోలుకుంది. వీళ్లిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 84 పరుగుల కీలక భాగస్వామ్యంతో భారీ స్కోర్ అందించారు. అర్ధ శతకం తర్వాత జోరు పెంచిన కార్సే.. సిరాజ్ సంధించిన స్లో బాల్‌కు బౌల్డ్ కావడంతో 387 పరుగులకే ఇంగ్లండ్ కుప్పకూలింది.

### మా దేశానికి రండి.. పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం

## బీసీసీఐకి శ్రీలంక విజ్ఞప్తి!




**ముంబై:** బంగ్లాదేశ్‌తో ఆగస్టులో జరగాల్సిన పరిమిత ఓవర్ల సిరీస్‌లు రద్దైన నేపథ్యంలో భారత క్రికెట్ జట్టు తమ దేశానికి రావాలని శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) బీసీసీఐని కోరింది. అదే ఆగస్టులో మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడేందుకు శ్రీలంక పర్యటనకు రావాలని ఎస్ఎల్‌సీ.. బీసీసీఐకి లేఖ రాసినట్టు బోర్డు వర్గాల వినికిడి. దీనిపై బోర్డు ఇంకా స్పందించలేదు. ఒకవేళ బీసీసీఐ గనక ఈ ప్రతిపాదనకు సరే అంటే.. అభిమానులు భారత క్రికెట్ దిగ్గజాలైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆటను వీక్షించే అవకాశం ఉంటుంది.

### టీమిండియాపై పదకొండో సెంచరీ..

## దిగ్గజాల సరసన చేరిన రూట్..!



**లార్డ్స్:** సుదీర్ఘ ఫార్మాట్‌లో పరుగుల వీరుడిగా పేరొందని జో రూట్ మరో శతకంతో రెచ్చిపోయాడు. లార్డ్స్ మైదానంలో భారత్‌పై సూపర్ సెంచరీతో జట్టును ఆదుకున్న రూట్ కెరియర్లో 37వ సారి మూడంకెల స్కోర్ అందుకున్నాడు. తనకు అచ్చొచ్చిన వేదికపై మరెవరికీ సాధ్యం కాని రికార్డును పట్టేశాడు రూట్. ఇక టీమిండియాపై అత్యధిక పర్యాయాలు వంద కొట్టిన రెండో ఆటగాడిగా చరిత్ర సృష్టించాడీ ఇంగ్లండ్ మాజీ సారథి. లార్డ్స్‌లో కీలక ఇన్నింగ్స్‌తో శతకం బాది జట్టును పటిష్ట స్థితిలో నిలిపిన రూట్ ఒకే మైదానంలో అత్యధిక సెంచరీల వీరుల క్లబ్‌లో చేరాడు. అతడికి ఈ మైదానంలో ఇది ఎనిమిదో సెంచరీ కాగా.. శ్రీలంక వెటరన్ మహేల జయవర్దనే కొలంబో మైదానంలో ఏకంగా 11 సెంచరీలతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఈ జాబితాలో లెజెండ్ డాన్ బ్రాడ్‌మన్ మెల్‌బోర్న్ గ్రౌండ్‌లో 9 సార్లు శతకం బాదాడు. దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్ కేప్ టౌన్‌లో రికార్డు స్థాయిలో 9 పర్యాయాలు మూడంకెల స్కోర్ అందుకున్నాడు. కుమార సంగక్కర (శ్రీలంక) తమ దేశంలోని కొలంబో స్టేడియంలో 8 సెంచరీలతో రికార్డు నెలకొల్పాడు. ఇండియా అంటే చాలు పూనకం వచ్చినట్టు ఆడే రూట్ 11 సెంచరీలతో ఆస్ట్రేలియా వెటరన్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ సరసన చేరాడు. వెస్టిండీస్ దిగ్గజం వివ్ రిచర్డ్స్, గ్యార్‌ఫీల్డ్ సోబర్స్ తలా 8 శతకాలు బాదారు.

# నాకో సమస్య ఉంది..

### బయటపడే మార్గాలను అన్వేషిస్తున్నా..!

### భారత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా




**న్యూఢిల్లీ:** భారత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. పారిస్ డైమండ్ లీగ్‌లో ఛాంపియన్‌గా నిలిచిన చోప్రా.. స్వదేశంలో తన పేరుతో నిర్వహించిన ఎన్‌సీ క్లాసిక్ తొలి సీజన్‌లో విజేతగా అవతరించాడు. ప్రస్తుతం యూరప్‌లో శిక్షణకు సిద్ధమవుతున్న వరల్డ్ బెస్ట్ జావెలిన్ త్రోయర్ తన వ్యక్తిగత జీవితం గురించి ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నాడు. తన ఆటలో ఓ సమస్య ఉందని.. అదేంటో ఈమధ్యే తెలుసుకున్నానని చెప్పాడు చోప్రా.

'నా గేమ్ పరంగా ఒక సమస్య ఉంది. ఈ ప్రాబ్లమ్ ఏంటనేది ఈమధ్యే తెలుసుకున్నా. అదేంటంటే.. ఈటెన్ బలంగా విసిరేసిన తర్వాత నేను తరచూ ఎడమ పక్కకు పడిపోతున్నా. అయితే.. శిక్షణ సమయంలో నేను అలా పడిపోవడం లేదు. కానీ, పోటీలోకి దిగాక మాత్రం బడిసెను శక్తికొద్దీ దూరం విసిరిన తర్వాత నాకు తెలియకుండానే ఎడమ వైపు కూలబడుతున్నా. దీనికి కారణం నేను ఎక్కువ శక్తిని ఉపయోగించడమే కారణమని కోచ్ చెప్పాడు. అందుకే ఈ సమస్య మళ్లీ తలెత్తకుండా చూసుకోవడంపై దృష్టి సారించాను' అని చోప్రా వెల్లడించాడు.

ఈమధ్యే దోహా డైమండ్ లీగ్‌లో తొలిసారి 90 మీటర్ల మార్క్ అందుకున్న చోప్రా అసాధ్యమన్నది లేదని చాటాడు. ఇదే అంశంపై స్పందించిన బడిసె వీరుడు ఏం అన్నాడంటే.. 'నా కెరీర్లో మొదటిసారి 90 మీటర్ల దూరం విసిరాను. అందుకు చాలా సంతోషంగా ఉంది. కానీ, ప్రతిసారి తొంభై మీటర్ల మార్క్ అందుకోవడంపై ఫోకస్ పెడుతున్నా. అయితే నేను నిలకడగా 88-89 మీటర్ల దూరం చేరుకుంటున్నా. నా ప్రదర్శన పట్ల కోచ్ సంతృప్తిగా ఉన్నానని చెప్పాడు.

నేను మరింత నిలకడగా రాణించాలని అనుకుంటున్నా. నా తదుపరి లక్ష్యం వరల్డ్ ఛాంపియన్‌షిప్స్. అక్కడ కచ్చితంగా పతకం గెలవాలి. సో.. ఆ టోర్నీ సన్నద్ధతకు ఏ ఈవెంట్ పనికొస్తుందో కోచ్‌తో మాట్లాడాక తేల్చుకుంటాను' అని చోప్రా వివరించాడు. టోక్యో వేదికగా సెప్టెంబర్‌లో వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ ప్రారంభం కానుంది. 13 నుంచి 21 తేదీ వరకూ జరుగబోయే ఈ మెగా టోర్నీ కోసం నీరజ్ చెక్ రిపబ్లిక్‌లో 57 రోజులు శిక్షణ తీసుకోనున్నాడు.



# పెళ్లంటే జీవితకాలపు బాధ్యత

## నటి శృతిహాసన్ ఆసక్తికర విషయాలు వెల్లడి

టాకీస్: తన వ్యక్తిగత విషయాల గురించి ఎప్పుడూ అభిమానులతో పంచుకునే నటి శ్రుతి హాసన్ పెళ్లి విషయంలోనూ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. పెళ్లిపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. వివాహం అనే ఆలోచన కూడా తనకు భయాన్ని కలిగిస్తుందన్నారు. నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి జీవితమంతా కష్టపడ్డాను. ఆ గుర్తింపును ఓ కాగితం ముక్కతో ముడిపెట్టాలనే ఆలోచన కూడా భయంకరంగా అనిపిస్తుంటుంది. వివాహ బంధాన్ని.. ఆ వ్యవస్థలో ఉన్న విలువలను నేను గౌరవిస్తాను. కానీ, వాటిని ధ్రువీకరించడానికి ఓ చట్టపరమైన కాగితం అవసరం లేదని నా అభిప్రాయం. నా జీవితంలో ఒకసారి నేను వివాహానికి చాలా దగ్గరగా వెళ్లాను. కానీ, అది ముడి పడలేదు. ఇద్దరు మనుషులు ఒక్కటవ్వాలంటే వారి అభిప్రాయాలు కలవాలి. అయినా, పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన విషయం కాదు. అది జీవితకాలపు బాధ్యతని అన్నారు. మరికొన్ని రోజుల్లో 'కూలీ'తో పలకరించనున్న ఆమె.. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు వెల్లడించారు. రజనీకాంత్‌తో కలిసి వర్క్ చేసిన అనుభవంతో పాటు తన కెరీర్ గురించి మాట్లాడారు. పవన్ కల్యాణ్ హీరోగా వచ్చిన 'గబ్బర్ సింగ్'లో అవకాశం వచ్చినప్పుడు కొన్ని కారణాల వల్ల నేను నటించలేనని చెప్పాను. హరీశ్ శంకర్ నన్ను ఒప్పించారు. ఆ పాత్రలో నన్ను కాకుండా మరో నటిని ఊహించుకోలే నన్నారు. కానీ, ఆ సినిమా నా కెరీర్ మొత్తాన్ని మార్చేసింది. నేను నటించిన ఎన్నో సినిమాలు మంచి సక్సెస్‌ను సాధించినప్పటికీ తొలి విజయాన్ని ఇచ్చింది మాత్రం తెలుగు పరిశ్రమే. పవన్ ఎప్పుడూ వ్యవసాయం గురించి, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారి గురించే మాట్లాడుతుండేవారు. ఆయనకు రాజకీయ రంగం కూడా సరిపోతుంది.మా నాన్న, రజనీకాంత్ ఇద్దరూ తమిళ ఇండస్ట్రీకి రెండు కళ్ల లాంటి వాళ్లు. రజనీకాంత్ సూపర్ స్టార్. ఇన్ని రోజులు మా నాన్న దృష్టికోణంలోనే ఆయన నాకు తెలుసు. 'కూలీ' సినిమాలో ఆయనతో వర్క్ చేస్తున్నప్పుడు పూర్తిగా తెలుసుకున్నాను. సెట్‌లో ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. తన చుట్టూ ఉండేవాళ్లు కూడా సంతోషంగా ఉండాలని కోరుకుంటారు. ఆయన ఎనర్జీకి ఎవరూ సరితూగరు. ఆయనతో కలిసి నటించే అవకాశం వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇండస్ట్రీలో ఎంతోమంది గొప్ప నటులు ఉన్నారు. ఎవరి ప్రత్యేకతలు వారికి ఉంటాయి.



# సాయిపల్లవి సీతకి సరిపోదంటూ విమర్శలు

**టాకీస్:** ఇండియన్ సినిమా హిస్టరీలో భారీ బడ్జెట్ తో రాబోతోంది రామాయణ మూవీ. రణ్ బీర్ కపూర్ రాముడిగా, యష్ రావణుడిగా, సాయిపల్లవి సీతగా కనిపిస్తున్నారు. నితేష్ తివారీ డైరెక్షన్ లో వస్తోంది. దాదాపు రూ.900 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమాను బాలీవుడ్ నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ నిర్మిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ సాయిపల్లవిని పనిగట్టుకుని కొందరు నార్త్ యూట్యూబ్ ఛానెళ్లు, కొందరు బాలీవుడ్ మీడియా వాళ్లు ట్రోల్స్ చేస్తున్నారు. సాయిపల్లవి సీత పాత్రకు సరిపోదంటూ తెగ పోస్టులు పెడుతున్నారు. కాజల్ రావణుడి భార్యగా, రకుల్ శూర్పనకగా నటిస్తున్నారంటూ ఒక ప్రచారం అయితే నడుస్తోంది. దీంతో కాజల్ లాంటి అందమైన భార్య ఉండగా రావణుడు అందంగా లేని సాయిపల్లవి కోసం పరితపించడం ఏంటని వెకిలి పోస్టులు పెట్టేస్తున్నారు. పైగా గో వధ చేసే వారిపై గతంలో సాయిపల్లవి సానుభూతి చూపించింది కాబట్టి ఆమెను సీత పాత్రకు తీసుకోవడం ఏంటని ట్రోల్స్ చేస్తున్నారు. కానీ సాయిపల్లవి సీత పాత్రకు న్యాయం చేస్తుందని ఆమె ఫ్యాన్స్ అంటున్నారు. ఎందుకంటే సీతమ్మ పాత్రలో చేయాలంటే అద్భుతమైన నటన వచ్చి ఉండాలని.. అది సాయిపల్లవికే ఉందంటున్నారు. పైగా ఇతర హీరోయిన్లలాగా సాయిపల్లవి ఎలాంటి ఎక్స్ పోజింగ్, బోల్డ్ పాత్రలు చేయలేదని.. కాజల్, రకుల్ అలాంటి పాత్రలు చేశారని చెబుతున్నారు. సీతమ్మ పాత్రలో చేయడానికి ఉండాల్సిన అన్ని అర్హతలు సాయిపల్లవికి ఉన్నాయంటున్నారు.

# రామాయణలో హనుమంతుడిగా సన్నీ డియోల్

## తొలి భాగంలో కేవలం 15 నిముషాలు మాత్రమే




**టాకీస్:** బాలీవుడ్ డైరెక్టర్ నితీశ్ తివారి రామాయణాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న విషయం తెలిసిందే. 'రామాయణ' పేరుతో ప్రతిష్ఠాత్మకంగా ఇది రూపొందుతోంది. ఇటీవల ఇందులోని పాత్రలను పరిచయం చేస్తూ వీడియోను విడుదల చేయగా దానికి మంచి ఆదరణ లభించింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో హనుమంతుడి పాత్రలో బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ కనిపించనున్నట్లు- టీమ్ అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. రెండు పార్టులుగా రానున్న ఈ సినిమా మొదటిభాగంలో ఆయన పాత్ర నిడివి చాలా తక్కువగా ఉండనున్నట్లు సమాచారం. 15 నిమిషాలు మాత్రమే కనిపిస్తారట. పార్ట్ 2లో ఎక్కువసేపు కనిపించనున్నారట. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడ నప్పటికీ ఈ వార్త మాత్రం సోషల్ మీడియా లో షేర్ అవుతోంది. ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి , రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. జటాయువు పాత్రకు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అమితాబ్ బచ్చన్ వాయిస్ ఓవర్ ఇవ్వనున్నట్లు సమాచా రం. మొదటిభాగం వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకురానుంది. రెండో భాగం 2027లో విడుదల కానుంది.

# షూటింగ్ పూర్తి చేసుకున్న 'ఓజీ'...

**పవన్ కళ్యాణ్ పవర్ ఫుల్ పోస్టర్ విడుదల**

**పవన్ గ్యాంగ్‌స్టర్‌గా నటిస్తున్న చిత్రం ఓజీ**

**సుజీత్ దర్శకత్వంలో భారీ యాక్షన్ థ్రిల్లర్**

**బిగ్ అప్ డేట్ ఇచ్చిన చిత్రబృందం**

**సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల**

టాకీస్: పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులకు అదిరిపోయే అప్ డేట్ వచ్చింది. పవన్ కల్యాణ్ నటిస్తున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ఓజీ' చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ అధికారికంగా ప్రకటించింది. షూటింగ్ పూర్తయిన సందర్భంగా పవన్ కల్యాణ్ సరికొత్త, పవర్ ఫుల్ పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. ఈ పోస్టర్ అభిమానులలో జోష్ మరింత పెరిగింది.

దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం పవన్ కల్యాణ్ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలవనుందని అభిమానులు బలంగా నమ్ముతున్నారు. ముంబై నేపథ్యంలో సాగే ఈ గ్యాంగ్‌స్టర్ కథలో పవన్ కల్యాణ్ ఒక శక్తివంతమైన, ఇంటెన్స్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. విడుదలైన పోస్టర్‌లో పవన్ కల్యాణ్ మాస్ లుక్‌లో కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు.

“అన్ని షూటింగ్‌లు అయిపోయాయి.. ఇప్పుడు థియేటర్ల వంతు.. ఓజీ ఆశ్చర్యపరచబోతోంది.” అంటూ మేకర్స్ సోషల్ మీడియా ద్వారా ఈ కీలక అప్‌డేట్‌ను అందించారు.




టాకీస్: రెబల్ స్టార్ ప్రభాస్, మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'ది రాజా సాబ్'. హార్రర్, కామెడీ, రొమాంటిక్ కథాంశంతో రానున్న ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిధిలు హీరోయిన్లుగా నటిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరి బ్యానర్ పై విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. తాజాగా రెబల్ స్టార్ ప్రభాస్ తమన్ మ్యూజిక్ సిట్టింగ్స్ లో దిగిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అయితే తమన్ అందించిన సాంగ్స్ ప్రభాస్ కు నచ్చలేదని అందుకే స్వయంగా డార్లింగ్ దిగాడని కెమెంట్స్ చేస్తున్నారు ఫ్యాన్స్. వాస్తవానికి రాజాసాబ్ సినిమాకు తమన్ ఎప్పుడో సాంగ్స్ కంపోజ్ చేసి ఇచ్చేసాడు. అందులో కొన్ని సాంగ్స్ ను షూట్ కూడా చేసారు. ఆ తర్వాత స్క్రిప్ట్ లో వచ్చిన కొన్ని మార్పుల కారణంగా ముందు కంపోజ్ చేసిన సాంగ్స్ అన్నిటిని పక్కన పెట్టేసారు. ఇప్పుడు మరలా తమన్ తో సాంగ్స్ ను కంపోజ్ చేపిస్తున్నారు. తమన్ అందుకోసం వర్క్ స్టార్ట్ చేసాడు. ఈ నేపథ్యంలోనే తమన్ స్టూడియోకు

# తమన్ స్టూడియోలో ప్రభాస్ సందడి

## రాజాసాబ్ సాంగ్స్ కంపోజింగ్‌పై ఆసక్తి



ప్రభాస్ వెళ్లి సరదాగా కాసేపు ఉండి వచ్చాడు. అంతే తప్ప వర్క్ నచ్చక కాదు. తమన్ సాంగ్స్ ఫినిష్ చేసాక సాంగ్స్ షూట్ చేసేందుకు షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. తమన్ వర్క్ పట్ల మారుతీ చాలా అండ్ టీ-మ్ హ్యాపీ గా ఉన్నారు. జెట్ స్పీడ్ లో జరుగుతున్న రాజాసాబ్ ఈ ఏడాది డిసెంబర్ 5న థియేటర్స్ లో అడుగుపెట్టనున్నాడు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.